# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :240 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: బుధవారం 03-12-2025 పేజీలు:4 వెల: 2.00


## ఏసీబీ డీఎస్పీ అధికారి ముసుగులో వసూళ్లు

వరంగల్, ఏసీబీ డీఎస్పీ అధికారి ముసుగులో ప్రభుత్వ అధికారులను బెదిరిస్తూ బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న ఘరానా ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడితో పాటు అతడికి సహకరించిన మరో నలుగురిని వరంగల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. అరెస్టయిన నిందితుల నుంచి పోలీసులు ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు రాచంపల్లి మంగళ శ్రీను అలియాస్ వాసు(45)ని సత్యసాయి పుట్టపర్తి జిల్లా వేలమద్ది గ్రామానికి చెందినవాడిగా గుర్తించారు. మిగతావారు కర్ణాటకకు చెందినవారిగా గుర్తించారు. ప్రస్తుతం సూర్యప్రకాశ్, తాటిమర్రి వేణు, కొత్తకోట రమణ పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ అరెస్టుకు సంబంధించిన వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మీడియాకు వెల్లడించారు. ప్రధాన నిందితుడు రాచంపల్లి శ్రీనివాస్.. ప్రభుత్వ శాఖల్లోని ఉన్నత పదవులో పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులతో పాటు పదవీ విరమణకు దగ్గరలో ఉన్న ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని వారికి ఏసీబీ డీఎస్పీనంటూ ఫోన్ చేసేవాడు. మీ మీద అవినీతి ఆరోపణలు వచ్చాయి.

## పవన్ కు తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వార్నింగ్..



హైదరాబాద్,ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై తెలంగాణ నేతలు మండిపడుతున్నారు. గత బుధవారం రాజోలు పర్యటన సందర్భంగా కోనసీమకు తెలంగాణ నేతల దిష్టి తగిలిందని పవన్ అగ్గిరాజేశారు. దీంతో తెలంగాణ నేతలు వంతులు వారీగా పవన్ పై ఫైర్ అవుతున్నారు. తాజాగా మంత్రి కోమటిరెడ్డి ఏపీ డీసీఎంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రిగా పనిచేస్తున్న కోమటిరెడ్డి.. పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజలకు భేషరుతగా క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చ్శారు. తాము తలచుకుంటే పవన్ సినిమాలు ఒకటి రెండు రోజులు కూడా తెలంగాణలో ఆడవంటూ సూటిగా వార్నింగు ఇచ్చారు.రాజోలు పర్యటన సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ చేసిన సరదా వ్యాఖ్యలు తెలంగాణలో రాజకీయ వేడిని రాజేశాయి. ఈ విషయంలో ముందు కల్పించుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి.. పవన్ మాటల ద్వారా తెలంగాణ భావోద్వేగాన్ని తట్టిలేపాలని ప్రయత్నించారు. ఇక ఈ విషయంలో తాము వెనకబడిపోకూడదన్నట్లు కాంగ్రెస్ నేతలు సైతం విమర్శలకు దిగుతున్నారు. రెండు రోజుల క్రితం జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ పై మాటల తూటాలు పేల్చారు. పవన్ పై హాట్ కామెంట్స్ చేసిన అనిరుధ్ రెడ్డి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే తన వంతు వచ్చిందన్నట్లు మంగళవారం మంత్రి కోమటిరెడ్డి విరుచుకుపడ్డారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కు ఏ మాత్రం రాజకీయాలు తెలియవని దుయ్యబట్టారు. పవన్ తెలిసి తెలియకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టిన కోమటిరెడ్డి.. మెగాస్టార్ చిరంజీవిపై పొగడ్తలు కురిపించారు. మెగాస్టార్ సూపర్ మ్యాన్ అంటూ కొనియాడిన మంత్రి, చిరంజీవికి రాజకీయాలు తెలియవని వెనకేసుకువచ్చారు. ఇదే సమయంలో పవన్ క్షమాపణ చెబితేనే తెలంగాణలో ఆయన సినిమాలు ఒకటి, రెండు రోజులైనా ఆడిస్తామని లేదంటే ఆయన సినిమాల ప్రదర్శనకు అనుమతి ఇచ్చే ప్రసక్తి లేదంటూ కోటమిరెడ్డి తేల్చిచెప్పారు.గత నెల 26న పవన్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించారు. ఆ సమయంలో కొబ్బరి రైతులతో ముఖాముఖి సమావేశంలో కోనసీమ అందాలను పొగిడే క్రమంలో నవ్వుతూ తెలంగాణ నేతలు దిష్టిపెట్టారా? అని నాకు అనిపిస్తుందని అన్నారు. మాటల క్రమంలో పవన్ చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నాయని విశ్లేషిస్తున్నారు. పవన్ వ్యాఖ్యలతో తెలంగాణ భావోద్వేగాన్ని తట్టిలేపాలని బీఆర్ఎస్ ప్రయత్నించగా, కాంగ్రెస్ కూడా ఆ రేసులోకి దూసుకొచ్చింది. రెండుపార్టీల నేతలు పవన్ పై పోటాపోటీగా విమర్శలు చేస్తూ తెలంగాణ స్వరం తామే అని నిరూపించుకోవాలని ప్రయత్నిస్తున్నారని అంటున్నారు. మొత్తానికి పవన్ చేసిన వ్యాఖ్యలు, ఆయనపై తెలంగాణ నేతల ఆగ్రహావేశాలు మరికొన్ని రోజులు కొనసాగే పరిస్థితులు కనిపిస్తున్నాయని అంచనా వేస్తున్నారు.

## రేవంత్ సర్కార్ కొత్త నిబంధనలు.. అలా చేస్తే ప్రభుత్వ ఉద్యోగం ఊస్ట్..!



హైదరాబాద్,ప్రభుత్వ పాఠశాలల్లో కొందరు ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడం, ఇష్టానుసారంగా సెలవులు పెట్టడంపై పాఠశాల విద్యాశాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. ముఖ గుర్తింపు హాజరు విధానం అమలులోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయుల హాజరు, అనధికారిక గైర్హాజరు వివరాలపై విద్యాశాఖ దృష్టి సారించింది.పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ సోమవారం డీఈవోలతో ఆన్‌లైన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ఒక ఉపాధ్యాయుడు అధికారికంగా సెలవు పత్రం ఇవ్వకుండా, చెప్పా పెట్టకుండా నెల రోజులపాటు విధులకు గైర్హాజరైతే వారిని శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించాలి అని డీఈవోలకు సూచించారు.వాస్తవానికి ఒక్క రోజు అనధికార గైర్హాజరుపైనా చర్యలు తీసుకోవచ్చు. అయినప్పటికీ ఉపాధ్యాయులు అనారోగ్యం లేదా ప్రమాదం వంటి సాకులు చెప్పి కోర్టుల్లో కేసులు వేసే అవకాశం ఉన్నందున.. నెల రోజుల గడువు తర్వాత షోకాజ్ నోటీసులు జారీ చేసి విచారణ జరిపి తొలగించాలని నిర్ణయించారు. తొలగింపు వివరాలను గెజిట్‌లో కూడా ప్రచురించాలని ఆదేశించారు. గత ఆగస్టు నుంచి అమలులో ఉన్న FRS విధానం ద్వారా టీచర్లు పాఠశాలకు వచ్చిన, వెళ్లిపోయిన సమయం కచ్చితంగా నమోదవుతోంది. ఇప్పటివరకు కేవలం హాజరు అయ్యారా లేదా అనే దానిపైనే దృష్టి పెట్టగా.. ఇకనుంచి ఆలస్యంగా వచ్చే ఉపాధ్యాయులపైనా చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. %ఖీ=ూ% అమలుతో కొంత ఆలస్యంగా వస్తా.., ముందుగా వెళ్తా.. అని అడిగే మొహమాటాలు హెచ్‌ఎంలకు తప్పాయని, భవిష్యత్తులో సమయపాలనపై మరింత పకడ్బందీగా చర్యలు ఉంటాయనే భావన ఉపాధ్యాయుల్లో ఏర్పడిందని గెజిటెడ్ హెచ్‌ఎంలు చెబుతున్నారు.దీర్ఘకాలిక సెలవులు తీసుకొని, వాటిని పొడిగించుకోకుండా ఒకటి, రెండేళ్ల పాటు విధులకు హాజరు కాని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. ఎక్కువగా విదేశాల్లోని తమ పిల్లలు లేదా భాగస్వాముల వద్దకు వెళ్లేందుకే ఈ సెలవులు తీసుకుంటున్నారు. అలాంటి వారిని గత రెండేళ్లలో సుమారు 50 మందిని విద్యాశాఖ ఉద్యోగం నుంచి తొలగించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని దాదాపు 24 వేల పాఠశాలల్లో 1.15 లక్షల మంది టీచర్లు పనిచేస్తుండగా.. వీరిలో 6,100 మంది డిప్యుటేషన్లపై ఇతర విభాగాల్లో ఉన్నారు. దీర్ఘకాలికంగా విధులకు గైర్హాజరవుతున్న మిగిలిన ఉపాధ్యాయులను కూడా గుర్తించి తొలగింపు చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు డీఈవోలను ఆదేశించారు. ఈ కొత్త నిబంధనల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరు, హాజరు మెరుగుపడుతుందని విద్యాశాఖ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

## ఇండియా సాయం కోరిన పాక్.. భారత్ గ్రీన్‌సిగ్నల్



ఢిల్లీ: శ్రీలంకకు సాయం చేసే విషయంలో దాయాది దేశం పాకిస్తాన్ మీడియా తప్పుడు ప్రచారాన్ని భారత్ ఖండించింది. దిత్వా తుపాను కారణంగా దెబ్బతిన్న శ్రీలంకకు సాయం చేసేందుకు గగనతల అనుమతి కోరినప్పటికీ..భారత్ అనుమతించలేదని పాక్ మీడియా ఫేక్ ప్రచారం? చేసింది. అయితే, ఇది అసత్య ప్రచారమని భారత్ క్లారిటీ ఇచ్చింది.వివరాల ప్రకారం.. దిత్వా తుపాను నేపథ్యంలో శ్రీలంకకు సాయం చేయడానికి పాక్.. భారత? గగనతలం నుంచి ప్రయాణించేందుకు సాయం కోరింది. సోమవారం భారత్‌ను సంప్రదించింది. అనంతరం, తమకు భారత్ అనుమతి ఇవ్వలేదని పాక్ మీడియా తప్పుడు ప్రచారం అందుకుంది. ఈ నేపథ్యంలో పాక్ మీడియా ప్రచారాన్ని భారత్ ఖండించింది. ఈ సందర్భంగా భారత్.. మన గగనతలంలో ప్రయాణించేందుకు సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు పాక్ సంప్రదించిందని, సాయంత్రం 5.30 గంటలకు భారత్ అనుమతి ఇచ్చిందని, అధికారిక ఛానల్ ద్వారా ఈ సమాచారం చేరవేసినట్లు అధికారులు పేర్కొన్నారు. మానవతా దృక్పథంతోనే అనుమతులు ఇచ్చినట్లు భారత్ స్పష్టం చేసింది. ఇది అసత్య ప్రచారమని భారత అధికారులు పేర్కొన్నారు. ఇది తప్పుదారి పట్టించే వార్తలు అని తెలిపారు.ఇదే సమయంలో గగనతల సంబంధిత నిర్ణయాలకు సంబంధించి భారత్ ప్రామాణిక కార్యచరణ, సాంకేతిక, భద్రతా అంచనాలను పరిగణనలోకి తీసుకుంటుందని, రాజకీయ కోణంలో అనుమతుల నిరాకరణ ఉండదని అధికారులు పేర్కొన్నారు. పాక్ విమానాలు భారత గగనతలం మీదుగా ప్రయాణించేందుకు వీలు లేనప్పటికీ పూర్తి మానవతా కోణంలో ఆలోచించి అనుమతులు ఇచ్చినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. పాక్ మీడియా నివేదికలు పూర్తిగా తప్పుఅని, బాధ్యత రాహిత్యమైనవని అధికారులు వివరించారు.ఇదిలా ఉండగా.. దిత్వా తుపాను కారణంగా శ్రీలంక అతలాకుతలమైంది. ఎడతెరిపిలేని వర్షం కారణంగా పలు ప్రాంతాలు నీట మునిగాయి. వందల సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్నాయి. అలాగే, వరద నీటిలో పలువురు గల్లంతయ్యారు. ఇటీవలి కాలంలో శ్రీలంకలో ఇంతటి పెను ముప్పు రాలేదని అధికారులు చెబుతున్నారు. దిత్వా కారణంగా తీవ్ర నష్టం వాటిల్లినట్టు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఒకే ప్రాజెక్టుకు సీఎం రెండు సార్లు శంకు స్థాపన చేస్తారా.. ?



హైదరాబాద్, సీఎం రేవంత్ రెడ్డి విజయోత్సవాల మొదటి సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. కొడంగల్, నారాయణ్ పేట లిఫ్ట్‌కు పార్లమెంటు ఎన్నికల సందర్భంగా శంకు స్థాపన చేశారు. నిన్న మక్తల్‌లో పంచాయతీ ఎన్నికల సందర్భంగా మరోసారి సీఎం శంకుస్థాపన చేశారన్నారు. ఒకే ప్రాజెక్టుకు సీఎం రెండు సార్లు శంకు స్థాపన చేస్తారా ? అని ప్రశ్నించారు.తెలంగాణ భవన్‌లో ఏర్పాటు ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. హామీలు అమలు చేయలేదు కనుకే సీఎం సభకు జనాలు రాలేదన్నారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే పాలమూరు-రంగారెడ్డి పథకాన్ని సీఎం పూర్తి చేయడం లేదు. కమీషన్ల కోసమే కొడంగల్ లిఫ్టు పథకాన్ని ముందుకు తెచ్చారు.. సీఎం, ఆయన సోదరులు కమీషన్ల కక్కుర్తిలో మునిగిపోయారు. కేసీఆర్ ఫార్మా సిటీకి సేకరించిన 14 వేల ఎకరాలను వాడుకుని ఫ్యూచర్ సిటీ అని మభ్యపెడుతున్నారన్నారు. ఎన్నికలప్పుడు ఫార్మా భూములను రైతులకు తిరిగి ఇస్తామని రేవంత్ హామీ ఇచ్చి మాట తప్పారు. ఫ్యూచర్ సిటీని నార్త్ ఇండియా సినీ యాక్టర్లకు అప్పజెబుతున్నారు. రామోజీ ఫిలిం సిటీ ఉండగా ఇంకా వేరే ఫిలిం సిటీలు ఎందుకు? అని ప్రశ్నించారు. కేసీఆర్ కృషి వల్లే కోకాపేటలో ఎకరాకు రూ.150 కోట్ల ధర పలుకుతోంది. కేసీఆర్ వేసిన వెంచర్లలో ప్లాట్లు అమ్ముకుని రేవంత్ బతుకుతున్నాడు. రేవంత్‌కు దమ్ముంటే ఫ్యూచర్ సిటీలో వెంచర్ వేసి కోకాపేట రేటు తెప్పించగలరా ?అని పట్నం నరేందర్ రెడ్డి ప్రశ్నించారు.

## అధిష్టానం ప్రకటిస్తే డీకే శివకుమార్ సీఎం అవుతాడు



బెంగళూర్ :కర్ణాటక లో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డికే శివకుమార్ మధ్య సీఎం కుర్చీ కోసం రాజుకున్న వివాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతో.. కాంగ్రెస్ పార్టీ నష్ట నివారణ చర్యలకు పూనుకుంది. బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ ఏర్పాటు చేసి ఐక్యతను చాటుకోవాలని సూచించింది. దాంతో ఇప్పటికే సిద్ధరామయ్య ఇంట్లో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ ముగిసింది. ఇవాళ డీకే శివకుమార్ రెండో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ కూడా నిర్వహించారు.ఆ సమావేశం అనంతరం సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం ప్రకటిస్తే డీకే శివకు మార్ సీఎం అవుతాడని అన్నారు. మా ఇద్దరి మధ్య ఎలాంటి విభేదాలు లేవని, ఇద్దరం కలిసికట్టుగా రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని చెప్పారు. ఇద్దరికీ హైకమాండ్ ఆదేశాలే శిరోధార్యమని, ఎవరు ఎప్పుడు ఏ పదవిలో ఉండాలనే విషయాన్ని అధిష్టానమే నిర్ణయిస్తుందని సిద్ధరామయ్య తెలిపారు.సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య సీఎం పదవి కోసం విభేదాలు నెలకొన్నాయని గత కొన్ని రోజులుగా ప్రచారం జరిగింది. ఒక దశలో సీఎం, డిప్యూటీ సీఎం సోషల్ మీడియాలో పోటీపోటీగా పోస్టులు పెట్టుకునే స్థాయికి గొడవ చేరింది. ఈ క్రమంలో రంగంలోకి దిగిన హైకమాండ్ ఆదేశాలతో నేతలిద్దరూ వెనక్కి తగ్గారు. హైకమాండ్ సూచన మేరకు బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లు నిర్వహించారు.

## సులభతర 'భగవద్గీతుశ్లోక & తాత్పర్య' పుస్తకాన్ని ఆవిష్కరించిన జస్టిస్ సురేపల్లి నందా మరియు వి.వి. లక్ష్మీనారాయణ



హైదరాబాద్, డిసెంబర్ 01, 2025: భగవద్గీత జయంతి సందర్భంగా సనాతన సింధు సత్సంగ్ ట్రస్ట్ ఛైర్మన్ స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతి రచించిన "భగవద్గీత ు శ్లోక అండ్ తాత్పర్య (ఎసెన్స్)" పుస్తకాన్ని కొండాపూర్ హనుమాన్‌నగర్‌లోని శారద హై స్కూల్‌లో ఘనంగా ఆవిష్కరించారు. శారద హై స్కూల్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, గురువులు, ఆధ్యాత్మికాభిలాషులు, ప్రముఖులు హాజరయ్యారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేపల్లి నందా మరియు సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్, ఐపీఎస్ (రిటైర్డ్) శ్రీ వి.వి. లక్ష్మీనారాయణ స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతిని అభినందిస్తూ, గీతా జ్ఞానాన్ని ఆధునిక యువతకు సులభంగా అర్థమయ్యే విధంగా అందించినందుకు ప్రశంసించారు. ప్రతి శ్లోకానికి స్పష్టమైన తాత్పర్యాన్ని అందించిన తీరు గమనార్హమని పేర్కొన్నారు.తన ప్రసంగంలో జస్టిస్ సురేపల్లి నందా భగవద్గీతను "ధార్మిక గ్రంథం కాదు, జీవన పథాన్ని చూపించే విశ్వవ్యాప్త జ్ఞాన గ్రంథం''గా అభివర్ణించారు. గీత మనలో సానుకూల శక్తిని పెంపొందించడం, అవకాశాలను గ్రహించడం, ప్రతి దశలో సరైన నిర్ణయం తీసుకునేందుకు దారి చూపుతుందని చెప్పారు. "పాఠశాల విద్యార్థుల నుంచి వృత్తి నిపుణుల వరకుప్రతి ఒక్కరి జీవితానికి గీత దిక్సూచి" అని పేర్కొన్నారు. గందరగోళం, నిరుత్సాహం, నైతిక సందిగ్ధతలలో ఇది వెలిగే దీపంలా మారుతుందని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, కరుణ, సత్యనిష్ఠలను అలవాటు చేసుకోవాలని, ఇవే సార్థక జీవనానికి పునాది అని ఆమె సూచించారు.

శ్రీ వి.వి. లక్ష్మీనారాయణ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపే విధంగా సందేశాన్ని అందించారు. "ధర్మక్షేత్రే కురుక్షేత్రే, క్షేత్రే క్షేత్రే ధర్మం గురుః" అనే మొదటి శ్లోకం అర్థాన్ని వివరిస్తూ, మనం ఎక్కడ ఉన్నా ధర్మాన్ని నిలబెట్టాలన్నారు. క్రమశిక్షణ, సానుకూల దృక్పథం విజయానికి మార్గదర్శకాలని చెప్పారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చెప్పిన మూడు లక్ష్యాలను విద్యార్థులు అనుసరించాలని పిలుపునిచ్చారు:

1. తల్లిదండ్రులకు గర్వకారణం కావడం
2. ఒకరోజు తమ పాఠశాల/కాలేజీకి ముఖ్య అతిథులుగా తిరిగి రావడం
3. సంతకం ఆటోగ్రాఫ్‌గా మారే స్థాయి సాధించడం

దక్షిణ కొరియా విద్యార్థుల పద్ధతులను ఉదాహరణగా తీసుకుని IQ పెంచే 21 స్క్వాట్స్, రివర్స్ నంబర్స్ & అల్ఫాబెట్స్, రోజూ సుడోకు వంటి అభ్యాసాలను సూచించారు. సీబీఐలో పనిచేసిన సమయంలో తీవ్రమైన బెదిరింపులు ఎదురైన సందర్భంలో గీతా సందేశం"ధర్మంతో కర్తవ్యాన్ని చేయాలి, ఫలితాన్ని భగవంతుని వద్ద వదలాలి''తనకు మానసిక ధైర్యం, సమతుల్యత ఇచ్చిందని పంచుకున్నారు.స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతి భగవద్గీతను అంతర్ముఖ సాధనకు మార్గదర్శకంగా వివరించారు. కురుక్షేత్రయుద్ధం మనసులోని అంతర్గత సంఘర్షణలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. భయం, అహంకారం, గందరగోళాన్ని జ్ఞానంతో జయించాల్సిన అవసరాన్ని చెప్పారు. ప్రతి శ్లోకాన్ని నాలుగు భాగాలుగా విభజించి, చిన్నవారి నుంచీ పెద్దవారి వరకు అందరికీ అర్థమయ్యేలా పుస్తకాన్ని రూపొందించిన విధానాన్ని వివరించారు. జీవితంలోని అనిశ్చిత పరిస్థితుల్లో స్థితప్రజ్ఞుడిగా ఉండడమే గీతా బోధన సారమన్నారు.కార్యక్రమానికి ప్లాంజేరి ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీ శంకర్ నారాయణ ప్లాంజేరి, జె.జె. ఆసుపత్రి ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎల్.జయంతి రెడ్డి, మరకత శివలింగ అంతర్జాతీయ ప్రచార కమిటీ ఛైర్మన్ శ్రీ ధూపటి దయాకర స్వామి, శారద హై స్కూల్ వివిధ బ్రాంచుల కరస్పాండెంట్లు మరియు ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు. విద్యార్థులకు భారతీయ విలువల పరిచయం చేసేందుకు పాఠశాల తీసుకున్న ఈ ముందడుగును అందరూ అభినందించారు."కృష్ణం వందే జగద్గురుమ్" ప్రధాన శీర్షికతో, "మానవత్వాన్ని దేవత్వంగా మార్చే పరమ మంత్రం" ఉపశీర్షికతో ప్రచురితమైన ఈ గ్రంథం త్వరలో హిందీ, ఇంగ్లీష్ భాషల్లో అందుబాటులోకి రానుంది. www.gitavision.com ద్వారాPDF, ఆడియో, ఈ-బుక్, సాఫ్ట్‌కాపీ రూపాల్లో 108కు, అలాగే హార్డ్‌కాపీలు కూడా అందుబాటులో ఉంటాయి.

## హిల్ట్ భూముల వ్యవహారంపై బీఆర్ఎస్ పోరుబాట..



హైదరాబాద్: గ్రేటర్ పరిధిలోని రూ.5లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. ఇందులో భాగంగా పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ నాయకులతో కూడిన నిజనిర్ధారణ బృందాలన్ నియమించారు. ఈ మేరకు పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయి పర్యటనలపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భం గా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమె త్తారు. గత ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపన కోసం, ఉపాధి కల్పన కోసం అతి తక్కువ ధరకే కేటాయించిన భూములను, ఇప్పుడు 'మల్టీ యూజ్ జోన్' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మారుస్తున్నారని ఆరోపించారు. సుమారు 9,300 ఎకరాల భూములను మార్కెట్ విలువ కంటే అతి తక్కువకు, కేవలం ఎస్ఆర్ఓ రేటులో 30 శాతానికే రెగ్యులరైజ్ చేసి,సుమారు రూ. 5 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టడానికి, కనీసం స్మశాన వాటికలకు కూడా స్థలాలు లేవని చెబుతున్న ప్రభుత్వం, వేల కోట్ల విలువైన భూములను మాత్రం ప్రైవేట్ వ్యక్తులకు చేస్తున్నదని మండిపడ్డారు.

రేపు, ఎల్లుండి పారిశ్రామిక వాడల్లో క్షేత్రస్థాయి పర్యటనలు

ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక వాడలను 8 క్లస్టర్లుగా విభజించి, పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో బృందాలు పర్యటించనున్నాయి. అక్కడ స్థానిక నాయకులను, ప్రజలను కలుపుకొని వాస్తవ మార్కెట్ విలువకు, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఉన్న భారీ వ్యత్యాసాన్ని ప్రజల ముందు ఉంచనున్నారు. వీటితో పాటు అక్కడి పారిశ్రామిక వాడల ద్వారా ప్రజా ఉపయోగ కార్యక్రమాలు ఏమేమి చేయవచ్చు, అక్కడి స్థానిక ప్రజల సుదీర్ఘకాలం డిమాండ్లను ఆకాంక్షలను కూడా పార్టీ నేతలు తెలుసుకోనున్నారు. ఒకప్పుడు అక్కడ పారిశ్రామిక వాడల ఏర్పాటు కోసం ప్రజలు భూములు ఇచ్చిన తీరును ప్రభుత్వం కేటాయించిన తీరును వాటిని అత్యంత చవకగా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వాలు కట్టబెట్టిన అంశాన్ని,

## సంపాదకీయం

**బుధవారం 03-12-2025**

# అప్పులు తీర్చే మార్గాలు ఏవీ !

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయి కొత్తంగా రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడి దాదాపు పుష్కరకాలం కావస్తోంది. రెండు రాష్ట్రాల్లో ఇద్దరు సిఎంలు, కొన్ని పొలిటికల్ పదవులు, డిజిపిలు, సిఎస్‌లు ఏర్పడ్డా ఈ రెండు రాష్ట్రాల్లో సాధించిన అభివృద్ధి శూన్యం. ఉమ్మడి ఎపిగా ఉన్ననాటికి నేటికి..సాధించిన అభివృద్ధి ఏదయినా ఉందంటే అది అప్పులు మాత్రమే. రాజకీయ నేతలకు పాలన చేతగాకపోవడం వల్ల రెండు తెలుగు రాష్ట్రాలు దాదాపు 15లక్షల కోట్ల అప్పుల్లో మునిగిపోయాయి. ఈ అప్పులు ఏ అభివృద్ధికి తార్కాణమో పాలకులు చెప్పాలి. దీనికి ఎవరు బాధ్యులో చెప్పాలి. ఉచిత పథకాలతో రాష్ట్రాలను దివాళా తీయిస్తున్న పాలకుల తీరు వల్ల రాష్ట్రాలు ఎప్పటికీ అభివృద్ధి చెందవు. ప్రజలు కడుతున్న విలువైన ట్యాక్స్ మొత్తాలను ఇలా దుబారా చేయడం ఎంతవరకు న్యాయమో ప్రజలే ఆలోచన చేయాలి. ఎంతకాలమీ ఉచిత పథకాలు ఇస్తారో చెప్పాలి. దీనిని ఏ రకమైన అభివృద్ధి అంటామో కూడా తెలపాలి. ఎందుకంటే రోడ్లు వేయడానికి నిధులు లేవు. అభివృద్ధి పనులకు నిధులు లేవు. సకాలంలో జీతాలు, పెన్షన్లకు నిధులు లేవు. స్కూళ్లు, వైద్యశాలలు కునారిల్లుతున్నాయి. పన్నులు మాత్రం దండిగా వసూలు చేస్తున్నారు. దక్షుడు లేని ఇంటికి పదార్థ వే లక్షలు వచ్చినా..అన్న శతకకారుడి పద్యం ఇప్పుడు ఈ రెండు తెలుగు రాష్ట్రాలకు బాగా సరిపోతుంది. కిలో రూపాయికే బియ్యం, పెన్షన్లు, ఉచితబస్సు, ఉచిత విద్యుత, ఉచిత సిలిండర్, ఉచితంగా ఇళ్లు..ఇలా ఇంచుమించుగా ఇలాంటి పథకాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో అమలవుతున్నాయి. ఇదే అభివృద్ధిగా చెబుతూ గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారు. పెన్షన్లు పంచడానికి ఎపిలో సిఎం చంద్రబాబు హెలికాప్టర్ వేసుకుని తిరుగుతున్నారు. ఇంతదండగ మారి ఖర్చు ఎందుకో బాబు చెప్పాలి. హెలికాప్టర్ ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయి. ఇక తెలంగాణలో పదేళ్ల కేసిఆర్ పాలన అప్పులకుప్పగా నిలిచింది. వాటిని సరిచేసుకుని అభివృద్ధి చేసుకుంటూ పోవాల్సిన రేవంత్ సర్కార్ కూడా ఉచిత పథకాలను రద్దు చేయలేకపోతున్నది. ఓట్లు పోతాయన్న భయంతో ఈ పథకాలు కొనసాగిస్తున్నారు. కిలో రూపాయికి బియ్యం ఇవ్వడమే పెద్ద దగా అనుకుంటే ..సన్నబియ్యం ఇవ్వడం పెద్ద సంస్కరణగా చెప్పకుంటున్నారు. ఇక దీనిని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఇటీవల కేంద్రానికి సిఎం రేవంత్ సూచించారు. ఇలాంటి పథకాలు ప్రజలు సోమరులై, ఇళ్లల్ఓ కూర్చుని పనులకు పోకుండా ఉంటున్నారు. గ్రామాల్లో లేబర్ కావాలన్నా దొరకడం లేదు. వ్యవసాయానికి కూలీలు దొరకడం లేదు. ఇవన్నీ తెలిసిన విషయాలే అయినా ఎవ్వరూ పెద్దగా చర్చించడం లేదు. ఇకపోతే రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా, ఈ విజన్ పాలసీ లక్ష్యాలు, ప్రణాళికలపై చర్చిస్తున్నారు. నిజానికి మిగులు ఆదాయం లేకుండా, అప్పులను ఎలా తీర్చాలో తెలప కుండా, ఉచిత పథకాల నుంచి గట్టెక్కడం ఎలాగో చెప్పకుండా తెలంగాణను 2037 వరకు 1 ట్రిలియన్ ఎకానమీగా మారుస్తామని ప్రకటించడం దారుణం. అంతేనా అంటే ప్రజలను మభ్య పెట్టడం తప్ప మరోటి కాదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సిఎంలు ఇద్దరూ అప్పులను తీర్చేందుకు ఉపాయాలు కోరడం లేదు. అప్పుల ఊబినుంచి బయటపడే ప్రయత్నం చేయడం లేదు. 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీగా ఎదగాలన్నదే మా తుది లక్ష్యం అని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా ప్రకటించుకుంది. ఈ లక్ష్యాలను సాధించేందుకు వీలుగానే మేము తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ పాలసీని రూపొందిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఈ ప్రణాళికలో ముఖ్యంగా సంక్షేమం, అభివృద్ధి సమానంగా ఉండేలా చూస్తున్నామని, వాటి మధ్య సమతుల్యతను కొనసాగించాలన్నదే తమ ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఈ విజన్ డాక్యుమెంట్ నాలుగు కోట్ల మంది ప్రజల భవిష్యత్తుకు సంబంధించినదని పేర్కొంటు న్నారు. దాని రూపకల్పనలో విస్తృత ప్రజాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నామని వెల్లడించారు. దాదాపు 4 లక్షల మంది ప్రజల సూచనలు, ముఖ్యంగా యువకుల అభిప్రాయాలు, సూచనలు తీసుకున్నా మని చెప్పారు. అంతేకాకుండా, అన్ని రంగాల్లోని మేధావులు, నిపుణులతో ఇప్పటివరకు దాదాపు 70 సమావేశాలు ఏర్పాటు చేశామని, అందరి అభిప్రాయాలను తీసుకున్న తరువాతే విజన్ డాక్యుమెంట్‌ను తుదిరూపు ఇస్తున్నామని తెలిపారు. మూడు ట్రిలియన్ ఎకానమీని ఎలా సాధ్యం చేయాలి అనే అంశాలపై ఇప్పటికే తమ బృందం విస్తృత కసరత్తు చేసిందని వివరించారు. ఈ విజన్ డాక్యుమెంట్‌ను డిసెంబర్ 8, 9 తేదీల్లో జరగబోయే గ్లోబల్ సమ్మిట్‌లో అధికారికంగా ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. పెట్టుబడులతో పాటు, కీలకమైన సలహాలు ఇవ్వడానికి చాలా మంది పారిశ్రామిక వేత్తలు ఈ గ్లోబల్ సమ్మిట్‌కి వస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు తెలియజేశారు. అయితే గ్రోత్ ఎలా ఉన్నా..ప్రస్తుతం ప్రభుత్వాలు నడపడానికే కనాకష్టంగా ఉంది. ఈ క్రమంలో తెలంగాణలో విలువైన ప్రభుత్వ ఆధీనంలోని భూములను తెగనమ్మ తున్నారు. భవిష్యత్ అవసరాలకు భూములు లేకుండా చేస్తున్నారు. ఎపిలో పోలవరం ఇంకా పూర్తి కాలేదు. జగన పోతూపోతూ ప్యాలెస్‌లు నిర్మించుకున్నారు. రాజధాని అమరావతికి ఇంకా భూసేకరణ చేస్తున్నారు. లక్ష ఎకరాలు టార్గెట్‌గా బాబు అడుగులు వేస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య లు పరిష్కరించకుండా విన్యాసాలు చేస్తూ, అధికారం అనుభవిస్తూ ఐదేళ్లు గడపడం పాలకులు అలవాటు చేసుకున్నారు. ఈ ఐదేళ్లలో ఇలాంటి సాధ్యం కాని ప్రయత్నాలు చేయడం,ప్రజలను మభ్య పెట్టడం చూస్తున్నాం. ఉమ్మడి ఎపి విడివడ్డాక తెలంగాణలో కెసిఆర్, ఎపిలో జగన్, చంద్రబాబులు చెప్పుకోదగ్గ ప్రజాభివృద్ధి కార్యక్రమాలు చేసిన దాఖలాలు శూన్యం. అప్పులు తీర్చే సమర్థత లేని నేతలు ఎన్ని చెప్పినా నమ్మడానికి లేదు. వీరు చేస్తారన్న భరోసా రాదు.

# అస్సాంలో ఆరెస్సెస్,బీజేపీల విద్వేష వ్యూహం!




అస్సాం:అస్సాంలో బహుళపెండ్లిళ్ల (పాలిగామి)ను నిషేధిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ఒక బిల్లును ప్రవేశపెట్టింది. ముస్లింల్లో పురుషులు, నలుగురు స్త్రీలను పెండ్లాడే అవకాశం ఉంది కనుక ఆ అవకాశాన్ని తొలగిస్తూ తాము చట్టం తెస్తునట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ చెప్పారు. ఆ రాష్ట్రంలోని అదివాసీల్లో కూడా పురుషులు ఒకరికంటే ఎక్కువమంది స్త్రీలను పెండ్లాడుతారు. ఆదివాసిల్లోని ఆ ఆచారాన్ని తాము నిషేధించడం లేదని కూడా చెప్పారు. ఒకరికంటే ఎక్కువ మందిని పెండ్లాడిన వారికి ఈ బిల్లు ప్రకారం ఏడేండ్ల కఠిన కారాగార శిక్షతో పాటు, జరిమానా విధించవచ్చు. రెండోసారి అదే తప్పు చేస్తే పదేండ్ల వరకు శిక్ష పడుతుంది. మొదటి భార్య బతికి ఉండి విడాకులు తీసుకున్న వారికి ఈ చట్టం వర్తిస్తుంది. ఆ రాష్ట్ర శాసనసభలో బీజేపీకి ఉన్న బలం వల్ల బిల్లు ఇట్టే చట్టంగా మారిపోతుంది. బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాలకు గవర్నర్ల బెడదలేదు. యూనిఫాం సివిల్ కోడ్ పేర ముస్లిం పట్ల ద్వేష భావాన్ని సజీవంగా ఉంచడానికి బీజేపీ ఒక్కొక్కటిగా ఇలాంటి చట్టాలను తెస్తోంది. అయితే చట్టాల ఆవశ్యకతను తెలియచేసే డేటా మాత్రం బీజేపీ ప్రభుత్వాల దగ్గర లేదు. ముస్లింలపై విద్వేషం చిమ్మే ఏ పనికైనా బీజేపీకి డేటా అక్కర్లేదు. ఏ డేటాతోనూ ఆ పార్టీకి, ప్రభుత్వాలకు పనిలేదు.సాధారణంగా ఒక బిల్లును చట్టసభల్లో పెట్టినప్పుడు ప్రభుత్వాలు బిల్లు ఆవశ్యకతను వివరిస్తాయి. కాని అస్సాం ప్రభుత్వం ఎలాంటి డేటాను సభ ముందు, తద్వారా ప్రజల ముందు ఉంచలేదు. కాంగ్రెస్, సీపీఐ (ఎం) ఇతర ప్రతిపక్షాలు ప్రభుత్వ ధోరణికి వ్యతిరేకంగా వాకౌట్ చేశాయి కూడా. బహు భార్యాత్వాన్ని నిషేధిస్తే తప్పేమిటని చాలామంది ప్రశ్నిస్తారు. నిజమే నిషేధం విధించడంలో తప్పులేదు. తప్పల్లా బీజేపీ ఉద్దేశంలోనే ఉంది. దానికి ఈ విషయంలో చిత్తశుద్ధి ఉంటే కనీసం అస్సాం రాష్ట్రంలోనైనా ఎంతమంది ఒకరికంటే ఎక్కువ మందిని పెండ్లాడుతున్నారు. అలా పెండ్లాడుతున్న వారిలో ఏమతం వారు, ఏ కులంవారు, ఏ తెగవారు ఎంత మంది ఉన్నారు? అన్న వివరాలు సేకరించి ఉండేది. కొద్దికాలం క్రితం సిఏఏ, ఎన్ఆర్‌సిల పేర అస్సాంలో ముస్లింలను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం పెద్ద ఎత్తున విద్వేష ప్రచారానికి తలపడింది. ఆ సమయంలోనైనా బహుళ పెండ్లిండ్లకు సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వం సేకరించి ఉండవచ్చు. కాని ఆ పని చేయలేదు. ఏ విషయంలోనూ బీజేపీ డేటా ఇవ్వదు. బట్ట కాల్చి మీద వేస్తుందంతే. వచ్చే ఏడాది అస్సాంలో జరుగనున్న ఎన్నికల దృష్ట్యా ముస్లింలపై మరో విద్వేష ప్రచారం ఇప్పుడు మొదలెట్టింది.ముస్లింలు, క్రైస్తవులపై విద్వేష ప్రచారం సాగించడం బీజేపీ, ఆరెస్సెస్‌ల రాజకీయ వ్యూహంలో భాగం. హిందూ ఓటు బ్యాంకును సుస్థిరం చేసుకోవడానికి మాత్రమే బీజేపీ ఆ పని చేయడం లేదు. ప్రజల దృష్టిని మత విద్వేషం వైపు మళ్లించి బడా కంపెనీలకు ప్రజాధనాన్ని దోచి పెట్టడం, స్త్రీలపై అణిచివేతను కొనసాగించడం, వర్ణవ్యవస్థను, మనుస్మృతిని సంరక్షిచడం వంటి పనులను సునాయాసంగా చేసుకెళ్లడానికి అనుసరించే ఎత్తుగడ అది. స్త్రీలను వంటింటికి, సంతానోత్పత్తికి పరిమితం చేయాలని సంఘీయులు పలుసార్లు బహిరంగంగానే చెప్తుంటారు. అందుకే పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టినా అమలుచేయటంలో చిత్తశుద్ధి లేదు. ఈ నేపథ్యంలోనే కార్మిక హక్కులను హరిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను మోడీ ప్రభుత్వం చల్లగా అమల్లోకి తెచ్చింది. పిఎఫ్ పెన్షన్ ఫండ్‌లో కోట్లాను కోట్ల రూపాయలు మగ్గుతున్నా పెన్షన్‌దార్ల పెన్షన్‌ను అది పెంచదు. పిఎఫ్ పెన్షన్‌దారుల్లో హిందువులే కదా అత్యధికంగా ఉండేది. అయినా వేయి, రెండువేల పెన్షన్‌తో వారు బతుకులు ఈడ్చాల్సిందేనని చెప్తోంది.ముస్లింలపై తమ విద్వేష ప్రచారంలో భాగంగా 2019లో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ట్రిపుల్ తలాఖ్ విడాకుల ఆచారాన్ని నిషేధిస్తూ చట్టం చేసింది. అప్పుడు కూడా ప్రభుత్వం దగ్గర డేటా లేదు. ఆ చట్టం అమల్లోకి వచ్చిన నాటి నుండి 2025 వరకు నమోదైన ట్రిపుల్ తలాక్ కేసులెన్నో తెలపమని సుప్రీంకోర్టు కొద్ది రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. కేంద్రం ఆ డేటాను సుప్రీం కోర్టు ముందుంచలేక పోయింది. ఎందు కంటే ముస్లింలను దోషులుగా నిలబెట్టడం తప్ప వారిలో వెనుకబడిన, కాలదోషం పట్టిన ఆచారాలను సంస్కరించే ఉద్దేశం బీజేపీ ప్రభుత్వాలకు ఏ కోశాన ఉండదు కనుక. ముస్లింల్లో విడాకులకు ట్రిపుల్ తలాఖ్ పద్ధతి ఒక్కటే ఉన్నట్లుగా ప్రచారం జరుగుతుంటే, అదికాదు షరియత్‌లో విడాకులకు అనేక పద్ధతులున్నాయని చెప్పే ధైర్యం ఉలేమాలకు లేదని ముస్లిం మేధావులు చెప్తున్నారు. బీజేపీ సాగిస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టగల నాయకత్వం ఈరోజు ముస్లింలకు లేకుండా పోయింది. ఇమారత్ ఎ షరియా, ముస్లిం పర్సనల్ లా బోర్డులే కాదు. ఉర్దూ సాంస్కృతిక వేదికలు కూడా నిస్సత్తువ స్థితిలోకి జారిపోయాయి.గతంలో ఆ సంస్థలు మాట్లాడేవి, అభ్యంతరాలు చెప్పేవి. ఇప్పుడు వాటి నోర్లు మూత బడ్డాయి. కారణం తనను ప్రశ్నించలేని దుర్బలులను ఏదో ఒక విధంగా ఆ సంస్థల్లో బీజేపీ ప్రభుత్వం జొప్పిస్తోంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో, రాజ్యాంగ బద్ధ సంస్థల్లో తన అనుయాయిలను బీజేపీ అక్రమంగా నియమిస్తోంది. లేదా వాటి స్వతంత్రతను నాశనం చేసి క్రమంగా తన చెప్పుచేతుల్లోకి తీసుకొంటోంది. ఫలితంగా వారు రాజ్యాంగ పరమైన, చట్టపరమైన నిబంధనలను, విలువలను గాలికొదిలి 'చిత్తం మహాప్రభో' అంటూ అడుగులకు మడుగులు ఒత్తే పరిస్థితి నెలకొంది. సిబిఐ డైరెక్టర్ పదవికి ఒక అధికారిని ఎంపిక చేయాల్సి వచ్చినప్పుడు మోడీ ప్రభుత్వం ఎలా వ్యవహరించిందో తేటతెల్లమైంది. ముస్లిం సంస్థలను కూడా ప్రభుత్వం అదే స్థితికి దిగజార్చగలిగింది. ఇక మీడియా రంగానికి వస్తే ఒకనాటి స్వేచ్ఛ, నేడు మీడియాకు లేకుండా పోయింది. జర్నలిస్టులను మీడియా యజమానుల దయా దాక్షిణ్యాలకు వదలి యాజమాన్యాల నుండి మోడీ సర్కార్ అదనపు ప్రాపకం సాధించింది.నాలుగు కార్మిక కోడ్‌లతో వర్కింగ్ జర్నలిస్టు యాక్టును, నాన్ జర్నలిస్టులకు కూడా రక్షణ కల్పించే పారిశ్రామిక వివాదాల చట్టం, తదితర రక్షణ చట్టాలను, వేతన బోర్డును లాగి పారేసింది. జర్నలిస్టులను, నాన్ జర్నలిస్టు ఉద్యోగులను యాజమాన్యాల కాళ్ల దగ్గర కట్టి పడేసింది. ఒకనాడు పత్రికా స్వేచ్ఛను కాపాడుకోవడానికి ఉద్యమాలు సాగించి ప్రభుత్వాల మెడలు వంచిన జర్నలిస్టులు నేడు నిస్సహాయులై అనాథలుగా మిగిలారు. ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసుల్లోని జర్నలిస్టుల గురించే ప్రజలకు తెలుసు కానీ నిజానికి ఆచరణలో మోడీ ప్రభుత్వం జర్నలిజాన్ని చంపేసింది. నిజమైన జర్నలిస్టులను ప్రధాన మీడియా నుండి దూరంగా తరిమేసింది. మేధావుల్లోనూ బీజేపీ తన వ్యూహాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. దాని విధానాలను విమర్శించగల మేధావుల సంఖ్య తగ్గిపోతోంది. కమ్యూనిస్టులను కుహనా సెక్యులరిస్టుగా చూపెట్టిన బీజేపీ, తనను ప్రశ్నించే మేధావులకు అర్బన్ నక్సలైట్ అన్న ముద్రను తగిలించి వారిని ప్రజల దృష్టి నుండి దూరం చేస్తోంది. ఒకనాడు సందేశాత్మక అభ్యుదయ సినిమాలు తీసిన దర్శకులు, నిర్మాతలు, రచయితలు సినిమా రంగంలో నేడు ఒంటరి పాలయ్యారు.ప్రముఖ హిందీ దర్శకుడు మహేశ్ భట్ నేటి సినిమా రంగం గురించి మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలపై అసమ్మతి తెలియచేసే దర్శకులను, రచయితలను పక్కకు పెట్టారు. రచయితలు స్వేచ్ఛగా సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై రాయడానికి బదులు, సెన్సార్ షిప్‌కు వేధింపులకు ముందుగానే భయపడి ఆ పరిధుల్లోనే కథలు రాస్తున్నారు. దేశ సమస్యలపై సినిమాలు తీద్దామంటే, మీ ఆలోచలను కవితలుగా రాసుకోండి, పుస్తకాలుగా రాసుకోండి తప్ప వాటిపై సినిమాలు వద్దని నిర్మాతలు చెప్తున్నారట. ముస్లింలపై చేస్తున్న దుష్ప్రచారంలో భాగంగా బీజేపీ తన మద్దతుదార్లను ఉపయోగించి కశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీస్ వంటి పలు సినిమాలను నిర్మిం చింది. వాటికి స్వయంగా ప్రధాని ప్రచారం చేసి పెట్టారు. అయితే అతిపెద్దగా ప్రజలను ఆకట్టుకోలేక పోయాయి. ప్రధాని ఇటీవల అయోధ్య రామమందిరంలో ధర్మధ్వజ్ (మతజెండా)ను ఎగరేశారు. 190 ఏండ్ల క్రితం లార్డ్ మెకాలే రూపొందించిన మానసిక బానిసత్వపు నిబంధనల నుండి భారతదేశం నేడు బయట పడిం దని ఆ సందర్భంగా చెప్పారు.మెకాలేకు, ధర్మధ్వజ్‌కు, మానసిక బానిసత్వానికి సంబంధం ఏమిటో మోడీ కే తెలియాలి. ప్రతి అంశాన్ని మతానికి జోడించే ప్రయత్నం అది. బానిసత్వం నుండి, మానసిక బానిసత్వం నుండి భారతీయులు ఏమాత్రమైనా బయటపడి ఉంటే అది దేశవిదేశాల్లో సాగిన ఉద్యమాల వల్ల భారత రాజ్యాంగం వల్ల మాత్రమే. ఈ సందర్భంగా న్యాయస్థానాల తీరును చూద్దాం. విద్వేష ప్రసంగాలను నియంత్రించడానికి ఒక చట్టం కావాలని తాము కోరడం లేదని సుప్రీం కోర్టు ఒక విచారణ సందర్భంగా వ్యాఖ్యానించింది. ప్రతి విద్వేష ప్రసంగాన్ని నియత్రించే పని కూడా న్యాయస్థానం చేయలేదని పేర్కొంది. నిజమే ప్రతి విద్వేష ప్రసంగాన్ని పరికించడం కోర్టులు చేయలేవు.కాని రాజ్యాంగబద్ధ స్థానల్లో ఉన్న వారి విద్వేష ప్రసంగాలను కూడా పరికించకపోతే ఎలా? వివిధ హక్కులపై నిషేధం విధిస్తూ చట్టాలు చేస్తున్న ప్రభుత్వాలు విద్వేష ప్రసంగాలను అరికట్టే చర్యలు మాత్రం చేపట్టవు. ఈ విషయంలో కోర్టులూ చేతులెత్తేస్తే పౌరుల పరిస్థితి ఏమిటి? చాలాకాలం తర్వాత బీజేపీ ప్రభుత్వం చివరకు కులగణనకు అంగీకరించింది. 2027లో జనాభా లెక్కల సేకరణ సందర్భంగా కులగణన చేపడతామని ప్రకటించింది. అయితే కులగణన వల్ల ప్రజల్లో చీలిక రాకూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్

# కూటమికి వదిలేసినట్లేనా...వైసీపీ సంచలనమేనా ?




అమరావతి,ఏపీలో కొత్త ఏడాది సరికొత్త రాజకీయాన్ని ఆవిష్కరించనుందా లేదా అన్నది తేలాలి అంటే కొంతకాలం ఆగాల్సిందే. ఏపీలో రాజకీయం ఎపుడూ వేడిగానే ఉంటుంది కదా మళ్ళీ కొత్తగా ఏమిటి అనుకోవచ్చు. మామూలు సమయంలో వేరు, ఎన్నికల వేళ అయితే అది ఇంకా ఎక్కువగా ఉంటుంది. అలాంటిది 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత జరగబోతోంది. 2026 వస్తూనే స్థానిక ఎన్నికల సమరానికి తెర తీయనుంది. ఈ ఎన్నికలు మూడు విడతలుగా జరిగే చాన్స్ ఉంది.

**సర్పంచులతో మొదలెట్టి :**

ముందుగా పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని అంటున్నారు. ఎందుకంటే ఈ ఎన్నికలకు రాజకీయ పార్టీల గుర్తులు ఉండవు, జెండాలు అంతకంటే ఉండవు. కేవలం మద్దతుదారులే కనిపిస్తారు. అలా ఈ ఎన్నికల ఘట్టం పూర్తి అయ్యాక ఎంపీటీసీలు, జెడ్పీటీసీల ఎన్నికలు ఉంటాయి. ఇవి రాజకీయంగా గ్రామ సీమల అభిప్రాయాన్ని గట్టిగా వెల్లడిస్తాయి. పైగా మంట పుట్టించే ఎన్నికలుగా ఉంటాయి. ఆ మీదట మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగుతాయి. ఇవి పూర్తిగా అర్బన్ ఓటర్ల మనోగతాన్ని వెల్లడిస్తాయి. ఈ విధంగా జరిగే లోకల్ బాడీ ఫైట్ ఏపీలో రసవత్తరంగా జరగాలీ అంటే కూటమి వర్సెస్ వైసీపీగా భీకర పోరు సాగాల్సి ఉంది.

**కూటమి రెడీగా :**

ఇక ఏపీలో అధికారంలో కూటమి ఉంది. మూడు ప్రధాన పార్టీలు అందులో ఉన్నాయి. టీడీపీ జనసేన, బీజేపీ కలసికట్టుగా ఉన్నాయి. ఇక అధికారం చేతిలో ఉంది కాబట్టి లోకల్ బాడీ ఎలక్షన్లలో గెలవడం అన్నది ఒక విధంగా ఈజీ టాస్క్. పైగా 2024 ఎన్నికల ఫలితాలు కళ్ల ముందు ఉండగానే రెండేళ్ళు తిరగకుండానే ఈ ఎన్నికలు జరగబోతున్నాయి కాబట్టి పెద్దగా తేడా వచ్చేది ఉండదని అధికార పార్టీ భావిస్తోంది. ఇక నూటికి నూరు శాతం స్ట్రైక్ రేటు సాధించాలని కూటమి భారీ టార్గెట్ ని పెట్టుకుంది. ఈ ఎన్నికలతో గ్రాస్ రూట్ లెవెల్ లో మరింత బలంగా పాతుకుని పోవాలని కూటమి పార్టీలు చూస్తున్నాయి. అదే సమయంలో క్యాడర్ కి కూడా అధికార పదవులు దక్కే ఎన్నికలు కాబట్టి అన్ని పార్టీలు పట్టు బిగిస్తున్నాయి.

**వైసీపీలో చర్చ :**

ఇదిలా ఉంటే వైసీపీలో దీని మీద చర్చ సాగుతోందా లేదా అన్నది అయితే ఇప్పటికీ తెలియడం లేదు. లోకల్ బాడీ ఎలక్షన్స్ అంటే ఎక్కువ వ్యవధి కూడా లేదు వైసీపీ ఓటమి పాలు అయి ఏణ్ణర్థం దాటింది. పైగా అధికారం పోయిన పార్టీ అన్ని విధాలుగా సర్దుకోవాల్సి ఉంటుంది. కానీ వైసీపీలో చూస్తే ఆ విధమైన వాతావరణం కనిపించడం లేదు అని అంటున్నారు. అధినేత అడపా దడపా జనంలోకి వెళ్తున్నారు. ఆయన పర్యటనకు జనాలు వస్తున్నారు. అయితే పార్టీలో ప్రతీ నియోజకవర్గం ఇంచార్జిలను సమావేశపరచి వారితో రెగ్యులర్ గా రివ్యూ చేయాల్సి ఉంటుంది. అంతే కాదు పార్టీ పరంగా సరైన దిశా నిర్దేశం చేస్తూ పార్టీని ముందుకు తీసుకుని పోవాల్సి ఉంది. అధికార పార్టీ ఎటూ దూకుడుగా ఉంటుంది కాబట్టి గట్టి అభ్యర్థులను అన్నింటికీ తట్టుకుని నిలిచే వారిని ఇప్పటి నుంచే ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది మరి వైసీపీ ఆలోచనలు ఏమిటి అన్నది తెలియడం లేదని అంటున్నారు. అయితే ఎటూ అధికార పార్టీకే మొగ్గు ఎక్కువగా ఉంటుంది కాబట్టి పోటీ చేయకుండా ఉంటేనే మేలు అని భావిస్తున్నారా అన్నది కూడా చర్చగా ఉంది. జనరల్ ఎలక్షన్స్ మీద టార్గెట్ చేసుకొవడమే బెటర్ అని కనుక ఆలోచిస్తే మాత్రం కూటమికే లోకల్ ఫైట్ ని వదిలేసినట్లుగా భావించాల్సి ఉంటుంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# రాజ్యాంగ విరుద్ధంగా సునీల్ వ్యాఖ్యలు

అమరావతి,సస్పెన్షన్‌లో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌పై డీవోపీటీ కార్యదర్శికి ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణమరాజు సోమవారం లేఖ రాశారు. ఈ లేఖలో కీలక అంశాలను ప్రస్తావించారు. ఇటీవల సునీల్ కుమార్ చేసిన వ్యాఖ్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి రఘురామ తీసుకెళ్లిన విషయం తెలిసిందే. కాపులు, దళితులు కలిస్తే రాజ్యాధికారం మనదేనని పీవీ సునీల్ కుమార్ చేసిన వ్యాఖ్యలను డీవోపీటీ దృష్టికి తీసుకువచ్చారు. కాపులు సీఎంగా, దళితులు డిప్యూటీ సీఎంగా ఉండవచ్చని సునీల్ కుమార్ వ్యాఖ్యలు చేశారని గుర్తుచేశారు. ఈ వ్యాఖ్యలు అఖిల భారత సర్వీసు రూల్స్‌కు విరుద్ధమని పేర్కొన్నారు. సునీల్ కుమార్ సస్పెన్షన్‌లో ఉన్నప్పటికీ ఆయనకు ఆల్ ఇండియా సర్వీస్ రూల్స్ ఎలా వర్తిస్తాయని ప్రశ్నించారు. ÷ాజకీయంగా కులాలను రెచ్చగొట్టే విధంగా సునీల్ కుమార్ వ్యాఖ్యలు ఉన్నాయన్న ÷ర్ అయ్యారు. రాజ్యాంగ నిబంధనలకు, ఆల్ ఇండియా సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా పీవీ సునీల్ కుమార్ వ్యాఖ్యలు ఉన్నాయని.. వీటిని వెంటనే డీవోపీటీ పరిశీలించాలని కోరారు. ఈ వ్యాఖ్యల విషయంలో సునీల్ కుమార్‌ను వెంటనే సర్వీస్ నుంచి తొలగించాలని రఘురామ కృష్ణమరాజు డిమాండ్ చేశారు.

# జగన్ ఐదేళ్ల పాలనలో విధ్వంసం

నెల్లూరు, జగన్ హయాంలోని ఐదేళ్లలో ఏపీ అస్తవ్యస్థమైందని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధ్వంస పాలనకు జగన్ పాలన సాక్ష్యమని విమర్శలు చేశారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేసిందని ధ్వజమెత్తారు. సోమవారం నెల్లూరు జిల్లాలోని సంగం మండలం గాంధీజన సంఘం గ్రామంలో పర్యటించారు మంత్రి ఆనం. దిత్వా తుఫానును సైతం లెక్కచేయకుండా వర్షంలో పేదల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి.ఏపీలో ప్రతీ నెలా ఒకటో తేదీన పండుగ వాతావరణం ఉంటుందని తెలిపారు. కొన్ని లక్షల ఇళ్లను కట్టకుండానే కట్టినట్లుగా చూపించి గత జగన్ ప్రభుత్వంలోని కాంట్రాక్టర్లు డబ్బులు దోచుకున్నారని ఆరోపించారు. ఏపీ ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికీ నిధులు సమకూర్చుకొని రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని వివరించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 36,937 మంది అర్హులైన లబ్దిదారులకు పింఛన్లు అందజేస్తున్నామని చెప్పుకొచ్చారు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి. కూటమి ప్రభుత్వం చెప్పిన మాటకు కట్టుబడి ఉందని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం పేదల శ్రేయస్సు కోసం ఎంతగానో కృషి చేస్తోందని తెలిపారు. వీర్లగుడిపాడు బ్రిడ్జి నిర్మాణానికి రూ.25 కోట్ల నిధులను మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంత సీసీ రోడ్లకు రూ.27 కోట్ల నిధులు మంజూరు చేశామని గుర్తుచేశారు. ఏపీలో ఎన్ని విపత్కర పరిస్థితులు వచ్చిన ప్రతి నెల ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీ ఆగదని చెప్పుకొచ్చారు. ఇంత వయస్సులో సైతం సీఎం చంద్రబాబు నాయుడు ప్రజల కోసం నిరంతరం పరితపిస్తున్నారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

# సంతానోత్పత్తి రేటు తగ్గుదలే కారణం!

న్యూఢిల్లీ: భారత దేశ జనాభా 2080 నాటికి 180–190 కోట్ల వద్ద స్థిరపడవచ్చు. రీప్లేస్‌మెంట్ లెవెల్ (పునఃభర్తీ స్థాయి) కన్నా తక్కువకు సంతానోత్పత్తి రేట్లు నిలకడగా పతనమవుతుండటమే ఇందుకు కారణం. ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది స్టడీ ఆఫ్ పాపులేషన్ తాజా అధ్యయనం ఈ వివరాలను వెల్లడించింది. ఐఎఎస్‌పీ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్రన్ తెలిపిన వివరాల ప్రకారం, 20 ఏళ్ల నుంచి జననాల రేట్లు బాగా తగ్గిపోతున్నాయి. 2000వ సంవత్సరంలో టోటల్ ఫెర్టిలిటీ రేటు 3.5 కాగా, నేడు అది 1.9కి పడిపోయింది. 2080నాటికి మన దేశ జనాభా 180–190 కోట్ల మధ్య ఉండవచ్చు. ఆ తర్వాత స్థిరపడటం ప్రారంభమవుతుంది. మొత్తం మీద భారతదేశ జనాభా 200 కోట్లు లోపుగానే ఉండవచ్చునని అన్ని అంచనాలు చెప్తున్నాయి.

**సంతానోత్పత్తి రేటు తగ్గుదల..**

సంతానోత్పత్తి రేటు తగ్గిపోవడానికి కారణాలేమిటంటే, అభివృద్ధి, విద్యా స్థాయులు పెరుగుతుండటమేనని చంద్రన్ చెప్పారు. మహిళలు విద్యావంతులవుతుండటంతో పెళ్లి, పిల్లల్ని కనడం, కుటుంబం పరిమాణంపై నిర్ణయాలు తీసుకోవడంపై వారి ప్రభావం పడుతున్నదన్నారు. గర్భనిరోధక సాధనాలు అందుబాటులో ఉండటం, సంతానోత్పత్తిని నియంత్రించే పద్ధతులు విస్తృతంగా ఉండటం కూడా సంతానోత్పత్తి తగ్గుదల వేగవంతమవడానికి దోహదపడుతున్నదన్నారు. ఈ రోజుల్లో దంపతులకు మెరుగైన సమాచారం అందుబాటులో ఉంటున్నదని, ఎప్పుడు, ఎందరు పిల్లల్ని కనాలో నియంత్రించుకుంటున్నారని తెలిపారు. ఆలస్యంగా పెళ్లి జరగడం, ఆర్థిక అవకాశాలు విస్తరించడం, ముఖ్యంగా మహిళలు ఉన్నత చదువులు చదువుతుండటం, కెరీర్‌లో ఎదుగుతుండటం వంటి వాటి వల్ల పునరుత్పాదన విధానాలు మారుతున్నట్లు తెలిపారు.అభివృద్ధి పెరిగితే, సంతానోత్పత్తి రేటు తగ్గుతున్నదన్నారు. నిరక్షరాస్యుల్లో ఇప్పటికీ సంతానోత్పత్తి రేటు మూడు కంటే ఎక్కువగా ఉంటున్నదని, విద్యావంతుల్లో 1.5 నుంచి 1.8 ఉంటున్నదని చెప్పారు. కేరళ రాష్ట్రం 1987–1989 నాటికి పునఃభర్తీ రేటు 2.1ని సాధించిందని, ప్రస్తుతం ఇది 1.5కు పతనమైందని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లో కూడా టోటల్ ఫెర్టిలిటీ రేటు చాలా తక్కువగా ఉందన్నారు. ఆరోగ్య సంరక్షణ మెరుగుపడటంతో ఆయుష్షు పెరుగుతున్నదని, 60 ఏళ్లు పైబడి జీవిస్తున్నవారు పెరుగుతున్నారని తెలిపారు. యువత ఉపాధి కోసం వలస పోతుండటంతో వృద్ధుల సంరక్షణ విషయంలో కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని చెప్పారు. వయోవృద్ధులకు డే కేర్ సర్వీసుల పట్ల ఆకర్షణ పెరుగుతున్నట్లు తెలిపారు.

## తిరుమల పరకామణి కేసు

తిరుపతి,టీటీడీ పరకామణి కేసు విచారణ సోమవారంతో పూర్తి అయినట్టు సమాచారం.. ఈకేసుకు సంబంధించి డిసెంబర్ 2న నివేదికను సమర్పించాల్సిందిగా హైకోర్టు గడువు విధించిన విషయం తెలిసిందే. దీంతో సీఐడీ అధికారులు మంగళవారం హైకోర్టుకు నివేదికను సమర్పించే అవకాశం ఉంది. హైకోర్టు ఆదేశాల మేరకు పరకామణి కేసును అక్టోబర్ 27న సీఐడీ అడిషనల్ డీజీ రవిశంకర్ అయ్యనార్ నేతృత్వంలో సీఐడీ విచారణ చేపట్టింది. ఈ కేసులో వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ చైర్మన్లుగా పని చేసిన వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి, అప్పటి ఈవో ధర్మారెడ్డితో పాటు పలువురిని సీఐడీ అధికారులు విచారించారు. మొత్తం 35 మందిని విచారించారు. అలాగే ఈ కేసులో ఫిర్యాదుదారుడు సీఐ సతీష్ కుమార్ విచారణకు వెళ్తూ హత్యకు గురవడం మరో సంచలనమనే చెప్పుకోవాలి. చెన్నై, బెంగుళూరు, విశాఖపట్నం, హైదరాబాద్, తిరుపతిల్లో నిందితుడు రవికుమార్, ఆయనకు సంబంధించిన వారి ఆస్తులను పరిశీలించి, వాటి డాక్యుమెంట్లను సీఐడీ సేకరించింది. గత ప్రభుత్వంలో లోక్ అదాలత్ రాజీ నేపథ్యంలో తిరుపతి రెండవ అదనపు కోర్టు సిబ్బందిని కూడా సీఐడీ అధికారులు ప్రశ్నించారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్‌లో అవినీతిపై సిబిఐ విచారణ

విశాఖపట్టణం,విశాఖ స్టీల్ ప్లాంట్‌లో అవినీతిపై సిబిఐ విచారణ చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. విశాఖపట్నం జగదాంబ జంక్షన్‌లో ఉన్న నండూరి ప్రసాదరావు భవనంలో సోమవారం స్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం.జగ్గునాయుడు, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వికుమార్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 'కోక్ ఓవెన్' డిపార్టుమెంట్లో గత 35 సంవత్సరాలలో ఎన్నడూ వాడని నాసిరకం కోక్‌ను వాడుతున్నారన్నారు. దీనివల్ల నాణ్యతలేని స్టీల్ ఉత్పత్తి అవుతుందని, దీనిని కొనుగోలుదారులు తిరస్కరిస్తున్నారని తెలిపారు. ఈ చర్యల వల్ల విశాఖ స్టీల్ బ్రాండ్‌ను చెడిపోయే ప్రమాదముందన్నారు. నేరుగా విదేశాల నుంచి దిగుమతిచేసే కోకింగ్ కోల్ బదులు మార్కెట్లోని నాసిరకం కోక్‌ను కమిషన్ల కోసం కొంటున్నారన్నారు. గతంలో నాసిరకం ఇనుపఖనిజం వాడడంపై సిబిఐకి సిఐటియు ఫిర్యాదు చేసిందన్నారు. జగ్గయ్యపేటలోని విశాఖస్టీల్ ఎ÷–లాంట్‌కు స్వంత గనుల నుంచి వచ్చే సున్నపురాయి (లైమ్ స్టోన్) సరఫరా లేకపోవడంతో రెండురోజులు అతిముఖ్యమైన స్టీల్ మెల్టింగ్ షాప్ (ఎస్ఎంఎస్)లో ఉత్పత్తి ఆగిపోయిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మార్కెట్లో ఉన్న మంచిపేరును దెబ్బతీయడానికే సిఎండి, కేంద్ర ప్రభుత్వం కావాలని ఇటువంటి తప్పుడు పద్ధతులకు దిగజారారని విమర్శించారు. 2024 నుంచి మిల్స్ డిపార్టుమెంట్లోని క్వాలిటీ ఇన్స్పెక్షన్‌ను ఎత్తివేశారన్నారు. విశాఖ స్టీల్‌ను దెబ్బతీయాలని, నష్టాల్లోకి నెట్టాలని చేస్తున్న తప్పుడు చర్య ఇది అన్నారు. స్టీల్ ప్లాంట్‌లో ఎప్పుడూ 45 రోజులకు సరిపడ ముడి ఖనిజాలు నిలవ ఉండాలన్నారు. కనీసం మూడు రోజులకు సరిపడ ముడిసరుకు నిల్వలు నేడు ఉండడం లేదన్నారు. విశాఖ స్టీల్ ఎ÷–లాంట్‌కు 2025 ఏప్రిల్ రూ.74 కోట్లు, మే నెలలో రూ.52 కోట్లు లాభాలు వచ్చాయన్నారు. అప్పటి వరకు రెండు బ్లాస్ట్ పర్నేష్‌లే నడిచాయన్నారు. 2025 జనవరి నుంచి జూన్ వరకు లాభాలు వచ్చాయన్నారు. 2025 జూన్ నుంచి మూడవ బ్లాస్ట్ పర్నేష్ ఉత్పత్తి ప్రారంభించిందన్నారు. 2025 జూలైలో రూ.121 కోట్లు, ఆగష్టులో రూ.157 కోట్లు నష్టాలు తెచ్చాయని, దీనికి బాధ్యులు ఎవరనే దానిపై సిబిఐతో విచారించాలని నర్సింగరావు డిమాండ్ చేశారు. 2025 జూన్ వరకు రెండు బ్లాస్ట్ పర్నేష్‌లలో 100 శాతం ఉత్పత్తి (రోజుకు15 వేల టన్నులు) అయిందన్నారు. జూన్ నుంచి నాసిరకం కోక్ బయట మార్కెట్ లో కొనడం వల్ల బ్లాస్ట్ పర్నేష్ లో ఉత్పత్తి 67 శాతంకు పడిపోయిందన్నారు. నాణ్యతలో పేరుగాంచి గతంలో 4 సంవత్సరాలు అత్యధికంగా విశాఖ స్టీల్ విదేశాలకు ఎగుమతులు చేసి అనేక అవార్డులు పొందిందని గుర్తు చేశారు. కానీ నేడు విశాఖ స్టీల్‌కు నాసిరకానికి రికార్డులు పొందే పరిస్థితిని తీసుకువచ్చిందన్నారు. 2024లో మొత్తం ఉత్పత్తిలో ముడిఖనిజాల ఖర్చు 63 శాతం ఉండగా, 2025లో ముడిఖనిజాల ఖర్చు 75 శాతంకు అమాంతంగా పెరిగిందన్నారు. ప్రపంచంలో ఏ స్టీల్‌లోనూ ముడిఖనిజం ఖర్చు ఈ స్థాయిలో లేదన్నారు. మన దేశంలో కూడా సెయిల్లో ముడిఖనిజం ఖర్చు సుమారు 50 శాతంగా ఉందన్నారు.ముడిసరుకు ఖర్చు పెంచి కావాలని విశాఖ స్టీల్ ఎ÷–లాంట్ ను నష్టాల్లోకి నెట్టడానికి కారకులెవరని ప్రశ్నించారు.ముడిసరుకు ముఖ్యంగా కోక్ దిగుమతి చేయకుండా మార్కెట్ లో కొనుగోలు చేయడంలో కమిషన్ ఎవరికి ఎంత ముట్టిందో సిబిఐ విచారణ చేయాలని మరోసారి నర్సింగరావు డిమాండ్ చేశారు.గత ఒక్క సంవత్సరంలో 10 వేల మంది స్టీల్ కార్మికులను తొలగించి,పనిభారం పెంచి, నాణ్యతలేకుండా సిఎండి విశాఖ స్టీల్ ప్లాంట్ ను నడుపుతున్నారని విమర్శించారు. కార్మికులకు ఉత్పత్తి ప్రకారం జీతాలు చెల్లిస్తామని సర్క్యులర్ జారీచేసారన్నారు.నేడు రోజుకు 16 వేల టన్నుల హాట్మెటల్ మూడు బ్లాస్ట్ పర్నేష్ లలో ఉత్పిత్తి అవుతుందన్నారు.19 వేల టన్నులకు పైగా హాట్మెటల్ ఉత్పత్తి అయితేనే పూర్తిజీతాలు చెల్లిస్తామని లింక్ పెట్టడం,ఇప్పుడిచ్చే జీతాలను కూడా దిగకోయడానికేనని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విశాఖ స్టీల్ ప్లాంట్లోని మొత్తం పనులను 42 ముక్కలుగా చేసి బయట కాంట్రాక్టులకు ఇవ్వడానికి విశాఖ స్టీల్ యాజమాన్యం 2025 సెప్టెంబర్ లో ఇ.ఓ. ఇ లు ప్రకటించడం అందరికీ తెలుసు అన్నారు.బయట కాంట్రాక్టర్లకు ఇవ్వడానికి సిద్ధం చేసిన టెండర్లలో వ్యయాన్ని విపరీతంగా పెంచారన్నారు.సింటర్ ఎ÷–లాంట్లో 2 మిషన్లు నడపడానికి గతంలో వ్యయం రూ.19 కోట్లును రూ.45 కోట్లకు పెంచారన్నారు. బ్లాస్ట్ పర్నేష్‌లో మెయింటెనెన్స్ పనులకు గతంలో రూ.15 కోట్లు ఉంటే అదే పనులను నిర్వహించడానికి రూ.85 కోట్లకు సిద్ధం చేశారన్నారు.స్టీల్ ఉత్పత్తి వ్యయం పెంచి మార్కెట్ లో కొనగోళ్లు పడిపోవడానికి చేస్తున్న కుట్ర ఇది అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్టీల్ ఎ÷–లాంట్ నష్టాలకు కారకులెవరో వెంటనే సమీక్షించాలని కోరారు.

# నిందితుడు ఎప్పటికీ దొరకరా?

అమరావతి,అధికార అండ వుంటే, ఎన్ని నేరాలు చేసినా చట్టానికి పట్టుబడరు. అధికారంలో ఉన్నోళ్లకు చట్టం చుట్టమని మరోసారి కూటమి పాలనలో రుజువైంది. నకిలీ మద్యం తయారీ కేసులో కీలక నిందితుడు, తంబళ్లపల్లె టీడీపీ మాజీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి మినహా, మిగిలిన వారంతా దాదాపు దొరికినట్టే. అసలు నకిలీ మద్యం తయారీతో సంబంధమే లేదని విజయవాడ కనకదుర్గమ్మ వారి సాక్షిగా భార్య, పిల్లలతో కలిసి సత్య ప్రమాణం చేసిన వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్‌ను విడిచిపెట్టలేదు.నకిలీ మద్యం తయారీ కేసులో ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు వాంగ్మూలం మేరకు జోగి బ్రదర్స్‌ను అరెస్ట్ చేయడంతో పాటు నాలుగైదు రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారించారు. విచారణలో తమకేమీ తెలియదని చెప్పినట్టు ప్రభుత్వ అనుకూల పత్రిక రాసుకొచ్చింది.ఈ నేపథ్యంలో తాజాగా నకిలీ మద్యం కేసులో 14వ నిందితుడైన తలారి రంగయ్యను కూడా ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామానికి చెందిన తలారి రంగయ్య నకిలీ మద్యం సీసాలపై అతికించే లేబుళ్ల డిజైన్ చేశారనే కారణంతో అరెస్ట్ చేశారు. లేబుళ్లు తయారు చేసిన వ్యక్తిని విడిచిపెట్టని ఎక్సైజ్ పోలీసులు,,,, నకిలీ మద్యం తయారీ కేసులో కీలక నిందితుడైన జయచంద్రారెడ్డిని మాత్రం పట్టుకోలేక పోతుండడం విచిత్రంగా వుందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.ఈ కేసులో ప్రధాన నిందితుడైన జనార్దన్‌రావు, అతని సోదరుడు, అలాగే జోగి బ్రదర్స్, ఇతరుల్ని పలుమార్లు అరెస్ట్ చేసిన పోలీసులకు , ఎందుకనో జయచంద్రారెడ్డి మాత్రం పట్టుబడడం లేదు. నకిలీ మద్యం తయారీ వ్యవహారంలో జయచంద్రారెడ్డిని మరిచిపోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు కనిపిస్తోందనే చర్చకు తెరలేచింది. నకిలీ మద్యం తయారీలో టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి, ఆయన డ్రైవర్, పీఏ, అలాగే మరో నాయకుడు సురేంద్ర నాయుడి పాత్ర వుందనే సంగతి తెలిసిందే.అందుకే జయచంద్రారెడ్డి, సురేంద్రనాయుడిని టీడీపీ నుంచి సస్పెండ్ చేశారు. సురేంద్రనాయుడిని కూడా అరెస్ట్ చేయకపోతే బాగుండదనే ఉద్దేశంతో, ఆ తంతు పూర్తి చేశారు. అసలు సంబంధమే లేదన్న ప్రత్యర్థి పార్టీ నాయకుల్ని అరెస్ట్ చేసి, వారి చుట్టూ ప్రభుత్వం, అనుకూల మీడియా కథ నడుపుతోంది.ఈ లోపు నకిలీ మద్యం తయారీలో అసలు టీడీపీ నాయకుల ప్రమేయాన్ని మరిచిపోయి,

# ఏకగ్రీవమే టార్గెట్ ! అభివృద్ధి చేస్తారా? దోచేస్తారా?




హైదరాబాద్, తెలంగాణ ఊళ్లకు.. సర్పంచ్ ఎన్నికల జ్వరం పట్టుకుంది. దాంతో.. ఊళ్లు మొత్తం ఊగిపోతున్నాయ్. ఇప్పుడు.. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఏకగ్రీవం హాట్ టాపిక్‌గా మారింది. సర్పంచ్ పోస్టులు.. 20 లక్షల నుంచి కోటి దాకా పలుకుతున్నాయ్. అసలు.. ఏకగ్రీవాల కోసం ఇంతింత ఎందుకు ఖర్చు చేస్తున్నారు? జనం కూడా అలా.. ఎలా కన్విన్స్ అవుతున్నారు? సర్పంచ్ పదవి అంటే.. లీడర్లకు అంత సోకెందుకు?

**సర్పంచ్ ఎన్నికలతో తెలంగాణ గ్రామాల్లో పొలిటికల్ హీట్**

ఎప్పుడైతే సర్పంచ్ ఎన్నికల షెడ్యూల్ రిలీజైందో.. అప్పటి నుంచి తెలంగాణ ఊళ్లని ఊగిపోతున్నాయ్. సర్పంచ్ పదవిని దక్కించుకునేందుకు కొందరు పోటీ పడుతుంటే.. ఇంకొందరు ఏకగ్రీవం చేస్తే ఇన్ని లక్షలిస్తామంటూ ఆఫర్లు ఇస్తున్నారు. ఈసారి అన్ని చోట్లా.. సర్పంచ్ పదవులు ఎంతో ఖరీదైనవిగా మారాయ్. అధికారం కోసం కొన్ని ఊళ్లలో ఎన్ని లక్షలు ఇచ్చేందుకైనా సిద్ధమంటున్నారు. వేలంలో సర్పంచ్ పదవులు 20 లక్షల నుంచి కోటి రూపాయల దాకా పలుకుతున్నాయ్. రాష్ట్రవ్యాప్తంగా చాలా గ్రామాల్లో ఏకగ్రీవం అనే మాట గట్టిగా వినిపిస్తోంది.

**స్కూల్ బిల్డింగ్‌లు, ఆలయాల అభివృద్ధికి హామీలు**

ఈ క్రమంలో.. తెలంగాణలో ఏకగ్రీవం అనే మాట అర్థమే మారిపోతున్న పరిస్థితులు నెలకొన్నాయ్. సర్పంచ్ పదవులను బహిరంగంగానే వేలం వేస్తున్నారు. గ్రామ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, స్కూల్ బిల్డింగ్‌లు, పాత ఆలయాల అభివృద్ధి, కొత్త ఆలయాల నిర్మాణం లాంటి హామీలతో.. ఊళ్లలో సర్పంచ్ పదవులకు వేలం నడుస్తోంది. తెలంగాణ ఎన్నికల సంఘం.. సర్పంచ్ పదవులను వేలం వేయడం నిబంధనలకు విరుద్ధమని చెబుతున్నా.. ఆ జిల్లా, ఈ జిల్లా అనే తేడా లేకుండా అన్ని చోట్లా ఇదే ట్రెండ్ కనిపిస్తోంది.

**తక్కువలో తక్కువ రూ.20 లక్షలకు వేలం..**

డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయ్. దాంతో.. అక్కడక్కడా డబ్బులిచ్చి ఏకగ్రీవం చేయించుకంటున్న సీన్లు కనిపిస్తున్నాయ్. భూముల విలువ పెరగడం, రోడ్డు బిట్లకు డబుల్ రేట్లు ఉండటం లాంటివన్నీ.. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులని ఖరీదైనవిగా మార్చేశాయ్. తక్కువలో తక్కువ 20 లక్షలకు వేలం వేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయ్. ఖమ్మం జిల్లాలోని కామేపల్లి మండలంలోని జోగ్గుడెంలో, ఎస్టీ మహిళకు రిజర్వ్ అయిన సర్పంచ్ సీటుకు.. ప్రజల సమక్షంలో వేలం నిర్వహించారు. 5 లక్షలతో మొదలైన వేలం.. 20 లక్షల దాకా వెళ్లింది. గెలిచిన వాళ్లు.. అక్కడికక్కడే 5 లక్షలు చెల్లించేశారు. ఈ డబ్బులతో.. ఊర్లో ఆంజనేయస్వామి గుడి నిర్మిస్తామని గ్రామస్తులు తెలిపారు. ఇలాంటి వార్తలు.. మిగతా జిల్లాల్లోనూ వినిపిస్తున్నాయ్.

**గద్వాల జిల్లాలో ఒక్కరోజే 13 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం**

జోగులాంబ గద్వాల జిల్లాలో శుక్రవారం ఒక్కరోజే 13 గ్రామాల్లో సర్పంచ్ స్థానాలకు ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. గట్టు మండలం మిరుదొడ్డిలో.. ఓ నాయకుడు సర్పంచ్ పదవి కోసం 90 లక్షలు ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అనంతారం గ్రామంలో సర్పంచ్ పదవి.. వేలంలో 60 లక్షలు పలికింది. చింతలకుంటలో 38 లక్షలకు సర్పంచ్ పదవి దక్కించుకున్నారు. మరో గ్రామంలో.. ఓ అభ్యర్థిని సర్పంచ్‌గా ఏకగ్రీవం చేసినందుకు గానూ.. ఎకరం భూమి పాఠశాల కోసం ఇస్తానని హామీ ఇచ్చి.. బాండ్ సమర్పించాడు. మల్దకల్ మండలం లోనిపల్లిలో శ్మశానవాటికకు రెండు ఎకరాల స్థలం ఇచ్చేందుకు ముందుకొచ్చిన వ్యక్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరో ఊళ్లో.. ఓ అభ్యర్థి సర్పంచ్ పదవి కోసం కోటి రూపాయల దాకా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని సీఎం రేవంత్‌రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లిలోనూ సర్పంచ్ పదవి ఏకగ్రీవమైంది.

**ఓ ఊళ్లో 57 లక్షలు, మరో గ్రామంలో 34 లక్షలకు వేలం..**

ఇంకొన్ని జిల్లాల్లో.. సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులు రెండూ.. ఒక్క ఓటు కూడా లేకుండానే ఖరారు చేసేస్తున్నారు. ఓ ఊళ్లో 57 లక్షలు, మరో గ్రామంలో 34 లక్షలకు సర్పంచ్ పదవులు వేలం వేశారు. గద్వాల్ మండలంలో.. ఓ విత్తన వ్యాపారి కొండపల్లి సర్పంచ్ పదవిని 60 లక్షలకు దక్కించుకున్నారు. కుర్వపల్లి మండలం నల్లదేవునిపల్లిలో.. సర్పంచ్ పదవిని ఓ అభ్యర్థికి 45 లక్షలకు ఏకగ్రీవం చేశారు. అప్పటికప్పుడు 15 లక్షలు చెల్లించారు. మిగతా మొత్తాన్ని.. ఎన్నికల తర్వాత చెల్లిస్తానని హామీ ఇచ్చారు. అయితే.. అన్నిచోట్లా డబ్బుల కోసమే ఏకగ్రీవం చేయడం లేదు. ఇందులో కొన్ని ఊళ్లు.. వేలానికి దూరంగా ఉన్నాయ్. జనగాం జిల్లాలోని మాన్సింగ్ తాండాలో.. ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేకుండానే.. సర్పంచ్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేవలం.. ఇద్దరు అభ్యర్థులే పోటీకి ఉండటంతో.. కేవలం టాస్ వేసి సర్పంచ్‌ని నిర్ణయించారు. ఏదేమైనా.. మెజారిటీ ఊళ్లలో మాత్రం.. లక్షలు పోసి సర్పంచ్‌లుగా ఏకగ్రీవం అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. కొన్ని ఊళ్లలో.. జనమంతా ఓ మాట అనుకొని.. సర్పంచ్ పోస్టుని వేలం వేస్తున్నారు.

**ఎంతయినా ఖర్చు చేసేందుకు సిద్ధపడుతున్న ఆశావహులు**

మరోవైపు.. అభివృద్ధి పనుల కోసమంటూ జనం కూడా ఏకగ్రీవాల వైపే మొగ్గు చూపుతున్నారు. ఆశావహులు కూడా ఎంతయినా ఖర్చు చేసేందుకు సిద్ధపడుతున్నారు. కొన్ని చోట్ల గ్రామ ఉమ్మడి అవసరాలను తీర్చేందుకు ముందుకు వస్తుండగా.. మరికొన్ని చోట్ల గ్రామస్తులే అభివృద్ధి పనుల కోసం ఎంత ఖర్చు చేస్తారని బేరసారాలు చేస్తున్నారు. పెద్ద పంచాయతీల్లో 50 లక్షల నుంచి 60 లక్షలు ఇచ్చేందుకు కూడా ఆశావహులు వెనుకాడడం లేదు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా బాలయ్యపల్లిలో పంచాయతీ భవనం నిర్మాణానికి.. 5 గుంటల స్థలం ఇచ్చేందుకు ముందుకొచ్చిన వ్యక్తిని సర్పంచ్‌గా.. ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని నిర్ణయించారు. ఇంకొన్ని గ్రామాల్లో.. ఆలయాల నిర్మాణం కోసం స్థలాలు ఇచ్చినవారిని ఏకగ్రీవం చేశారు. అయితే.. పంచాయతీ ఎన్నికల్లో వేలం పాటలు, బేరసారాలు, బెదిరింపుల లాంటి ప్రలోభాలతో జరిగే ఏకగ్రీవాలు చెల్లవని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు.. ఎన్నికల సంఘం జారీ చేసిన సర్క్యులర్‌ని గుర్తు చేస్తున్నారు.

**అక్రమాలు జరిగినట్లు తేలితే ఏకగ్రీవ ఎన్నిక రద్దు..**

ఈసారి నామినేషన్లు విత్ డ్రా చేసుకున్న వెంటనే.. రిటర్నింగ్ ఆఫీసర్ ఫలితాన్ని ప్రకటించకుండా హోల్డ్‌లో పెట్టనున్నారు. తర్వాత.. ఆఫీసర్లు గ్రామానికి వెళ్లి ఏకగ్రీవ ఎన్నిక మోసపూరితంగా జరిగిందా? ప్రలోభాలకు లోను చేశారా? బలవంతంగా ఒప్పుకున్నారా? అనే విషయాలు తెలుసుకోనున్నారు. ఒకవేళ.. వేలం పాటలు జరిగినట్లు, ప్రలోభాలు ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు దొరికితే.. ఆ గ్రామ ఫలితాన్ని ఆపేస్తారు. దానిపై.. 24 గంటల్లో ఎంక్వైరీ చేసి.. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగినట్లు తేలితే.. ఆ గ్రామ ఎన్నికను రద్దు చేయాలని కలెక్టర్.. ఎన్నికల సంఘానికి సిఫారసు చేసే అవకాశం ఉంటుంది. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలకు పాల్పడితే.. పదవి దక్కకపోగా క్రిమినల్ కేసులు నమోదవుతాయని ఆఫీసర్లు హెచ్చరిస్తున్నారు.

20 అంటే 20 ఇస్తున్నారు.. 50 అంటే 50 ఇస్తున్నారు.. కొన్ని చోట్ల కోటి ఇచ్చేందుకు కూడా పోటీ నెలకొంది. ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికయ్యేందుకు.. ఎంతైనా ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. జనం ఊరు అభివృద్ధి కోసమే ఏకగ్రీవాలు చేస్తున్నారా? లేక.. ఒకేసారి డబ్బులు ఎక్కువొస్తున్నాయని చూస్తున్నారా? అభ్యర్థులు ఇప్పుడు ఎన్ని లక్షలైనా ఇస్తారు సరే.. తర్వాత ఐదేళ్ల పాటు మిమ్మల్ని పట్టించుకుంటారా? ఊరుని అభివృద్ధి చేస్తారా? ఇప్పుడు ఏకగ్రీవం కోసం పెట్టిన ఖర్చుని.. మళ్లీ రికవరీ చేసే ఆలోచనతో ఉంటే.. పరిస్థితేంటి?

**ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రశ్నిస్తున్న సర్పంచ్ పదవుల వేలం..**

తెలంగాణలో సర్పంచ్ అనే పదంతో పాటు ఎక్కువగా వినిపిస్తున్న మరో పదం ఏకగ్రీవం. పంచాయతీ ఎన్నికలు జోరుగా సాగుతున్న వేళ.. కొన్ని చోట్ల సర్పంచ్ పదవులకు వేలం వేస్తున్న పరిణామాలు.. ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రశ్నిస్తున్నాయ్. గ్రామాల అభివృద్ధి లక్ష్యాలపై సందేహాలు తలెత్తేలా చేస్తున్నాయ్. సాధారణంగా.. ఎక్కడ సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసినా.. ఒకే ఒక్క వాదన గట్టిగా వినిపిస్తుంది. అదే.. అభివృద్ధి మంత్రం. ఊరికోసమే ఇలా చేశామని చెబుతుంటారు. దాంతోపాటు.. ఎన్నికలంటే గ్రామంలో పోటీ, వ్యక్తిగత కక్షలు, విభేదాలు పెరుగుతాయ్. ఏకగ్రీవమైతే.. గ్రామంలో శాంతి, సామరస్యం నెలకొని.. అంతా కలిసి అభివృద్ధికి కృషి చేస్తారంటారు. ఎన్నికల్లో పోటీ పడితే అభ్యర్థులు లక్షల్లో డబ్బు ఖర్చు చేస్తారు. ఏకగ్రీవం చేయడం వల్ల.. ఆ ఖర్చుని ఆదా చేసి.. ఆ మొత్తాన్ని గ్రామ అభివృద్ధికి ఉపయోగిస్తే మంచిదని.. ఏకగ్రీవం అనే చర్చ తెరమీదికొస్తుంటుంది. అప్పుడప్పుడు ప్రభుత్వాలు కూడా ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రాపంచాయతీలకు కొంత ఆర్థిక ప్రోత్సాహాలు ఇస్తుంటాయ్. వీటి కోసం కూడా గ్రామస్తులు ఏకగ్రీవానికి మొగ్గు చూపుతారు. ఇప్పుడు కూడా కొందరు అభ్యర్థులు ఇచ్చే లక్షల రూపాయలను.. నేరుగా గ్రామాభివృద్ధి పనులకు, ఆలయాలు, పాఠశాల భవనాలకు ఉపయోగిస్తామని చెబుతున్నారు. అయితే.. ఇదంతా అభివృద్ధి కోసం విరాళమని వాదిస్తున్నారు. కానీ.. సర్పంచ్ పదవికి వేలం వేయడమనేది.. ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమనే విమర్శలు కూడా బలంగా వినిపిస్తున్నాయ్.

**ఐదేళ్ల పాటు ప్రజల్ని పట్టించుకుంటారా? ఊరు అభివృద్ధి చేస్తారా?**

అభ్యర్థులు ఇప్పుడు ఎన్ని లక్షలైనా ఇస్తారు. కానీ.. తర్వాత ఐదేళ్ల పాటు గ్రామ ప్రజల్ని పట్టించుకుంటారా? ఊరుని అభివృద్ధి చేస్తారా? ఇప్పుడు ఏకగ్రీవం కోసం పెట్టిన ఖర్చుని.. మళ్లీ రికవరీ చేసే ఆలోచనతో ఉంటే.. పరిస్థితేంటనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయ్. సర్పంచ్ పదవికి లక్షలు ఖర్చు పెట్టేవారిలో.. చాలా మంది దానినొక పెట్టుబడిగానే చూస్తారు. ఒక్కసారి సర్పంచ్ అయితే.. రాబోయే ఐదేళ్లలో ఆ డబ్బుని తిరిగి రాబట్టుకునేందుకే ప్రాధాన్యత ఇస్తారు. ఐదేళ్లూ ఆ దిశగా ప్రయత్నాలు చేస్తారు. ఈ క్రమంలో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు వచ్చే ఉపాధి హామీ నిధులు, పారిశుద్ధ నిధులు, ఇతర అభివృద్ధి పనులకు మంజూరయ్యే నిధులను.. కాంట్రాక్టుల రూపంలోనూ, బిల్లుల రూపంలోనూ స్వాహా చేసే అవకాశం ఉంటుంది. అంతేకాదు.. ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసే విషయంలోనూ అవినీతి, అక్రమాలకు పాల్పడే పరిస్థితులుంటాయ్.

**ఖర్చుని తిరిగి రాబట్టుకోవటం మీదే దృష్టి పెడితే?**

అందువల్ల.. ఏకగ్రీవం కోసం డబ్బులిచ్చే అభ్యర్థులు.. సర్పంచ్ పదవి పొందాక.. అధికారం చేతిలోకి వచ్చాక.. తమ ఖర్చుని తిరిగి రాబట్టుకోవడం మీదే దృష్టి పెడితే.. ఊరు అభివృద్ధిని నిర్లక్ష్యం చేసే ప్రమాదం ఉంటుదనే చర్చ అక్కడక్కడా వినిపిస్తోంది. సర్కారు నుంచి గ్రామానికి వచ్చే నిధులు.. సర్పంచ్ ఖాతాలోకి మళ్లితే.. గ్రామంలో జరగాల్సిన ఎలాంటి అభివృద్ధి పనులు జరగవు. వేలం పాటలో పదవి దక్కించుకొని.. ఊరుకు డబ్బులు సమర్పించుకున్న వాళ్లంతా.. జవాబుదారీతనంతో ఉండకపోవచ్చు. ఎందుకంటే.. వాళ్లు ఎన్నికైంది.. ఓట్లతో కాదు. డబ్బులతో!

**ప్రజల తీర్పు, నాయకత్వ లక్షణాలు, సేవా భావమే ప్రధానం కావాలి!**

సర్పంచ్ ఎన్నిక అంటే.. గ్రామ నాయకుడిని ఎంచుకోవడం. ఇక్కడ.. ప్రజల తీర్పు, నాయకత్వ లక్షణాలు, సేవా భావమే.. ప్రధానం కావాలి. అలాకాకుండా.. డబ్బు ప్రామాణికం అయినప్పుడు.. నిజమైన సేవాభావం కలిగి ఉన్న పేద, మధ్యతరగతి అభ్యర్థులు పోటీ చేసే అవకాశం కోల్పోతారు. లక్షలు ఖర్చు పెట్టగలిగిన వారే నాయకుడు అవుతారు. సమర్థవంతంగా పరిపాలించే సామర్థ్యం ఉన్నవాళ్లు కూడా ఊరుకొని ఊళ్లోనే ఉండిపోవాల్సి వస్తుంది. అప్పుడు.. గెలిచేది ప్రజాస్వామ్యం కాదు. డబ్బు మాత్రమే. ఇది.. గ్రామీణ స్థాయిలో పాలనా వ్యవస్థను దెబ్బతీస్తుంది. సర్పంచ్ పదవికి లక్షలు ఇస్తామనడం వెనుక.. గ్రామాభివృద్ధి, ఆలయాలు, స్కూళ్ల, ఇతర భవనాల నిర్మాణం లాంటివన్నీ కాస్త సానుకూలంగానే కనిపించినా.. దాని వెనక రాజకీయ పలుకుబడి, ప్రభుత్వ నిధులు, పరోక్షంగా ఇచ్చిన డబ్బుని తిరిగి రాబట్టుకోవడం లాంటి ఆలోచనలుంటాయనే చర్చ కూడా జరుగుతోంది. ఒక్కసారి వేలం పాటలో పదవి దక్కించుకొని.. ఆ నాయకుడు సర్పంచ్‌గా ఎన్నికైతే.. వచ్చే ఐదేళ్లలో గ్రామాన్ని అభివృద్ధి చేస్తారా? లేదా? అనేది అనుమానమే.ఎప్పుడైతే.. డబ్బులిచ్చి అధికారం కొనుగోలు చేస్తారో.. అది క్రమంగా గ్రామీణ పాలనలో అవినీతిని పెంచి, ప్రజాస్వామ్య మూలాలను బలహీనపరుస్తుంది. గ్రామస్తులు తాత్కాలికంగా డబ్బుతో గానీ, అభివృద్ధి పేరుతో గానీ ప్రలోభాలకు గురై ఏకగ్రీవం చేస్తే.. తర్వాత ఐదేళ్ల పాటు ఊళ్లో అభివృద్ధి జరగకపోతే పరోక్షంగా నష్టపోయేది తామేనన్న విషయం గుర్తుంచుకోవాలి. అందువల్ల.. మీరు ఏకగ్రీవం చేయాలనుకున్న అభ్యర్థి ఇచ్చే డబ్బులనే కాదు.. అతని గుణగణాలు, నిబద్ధత, నాయకత్వ లక్షణాలను కూడా చూడండి. కేవలం.. ఊరుకు ఎక్కువ డబ్బులిస్తున్నారన్న ఒకే ఒక్క కారణంతో.. గుడ్డిగా ఏకగ్రీవం చేయడం ఊరు భవిష్యత్‌కు అంత మంచిది కాదంటున్నారు. అంతేకాదు.. గ్రామ పంచాయతీల ఏకగ్రీవం కోసం వేలం పాటలు వేయడమనేది.. నిబంధనలకు విరుద్ధం. ఎన్నికల కమిషన్ ఇలాంటి ఏకగ్రీవాలపై విచారణ జరిపి.. ఆధారాలు దొరికితే ఏకగ్రీవాలను రద్దు చేసే అవకాశం ఉంది. అంతేకాదు.. తిరిగి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది.

# మూలిగే నక్క మీద తాటికాయ... పాక్ కు ఇది కొత్త చావు దెబ్బ!

ఇస్లామాబాద్:పాకిస్థాన్ తో సరిహద్దు పంచుకుంటూ, ఇటీవల సరిహద్దు ఘర్షణలు జరిగిన ఆఫ్ఘనిస్థాన్.. ఈ ప్రపంచంలోని అత్యంత పేద దేశాలలో ఒకటిగా ఉందన్న సంగతి తెలిసిందే. దీని తలసరి జీడీపీ కేవలం 434 డాలర్లు మాత్రమే! ఇక ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమంలో గ్లోబల్ మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ - 2025 ప్రకారం.. ఆఫ్ఘనిస్తాన్ జనాభాలో 64% కంటే ఎక్కువ మంది పేదరికంలో నివసిస్తున్నారు.అలాంటి పేద దేశంపై పాకిస్థాన్ పెద్ద పెద్ద డైలాగులు చెప్పి, ఇప్పుడు ఊహించని స్థాయిలో కొత్త కష్టాలు కొని తెచ్చుకుంది. ఇందులో భాగంగా.. ఆ దేశ ఐ.ఎస్.పీ.ఆర్. డైరెక్టర్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి.. ఆఫ్ఘనిస్థాన్ ను హెచ్చరిస్తూ.. 'రక్తం, వ్యాపారం కలిసి సాగలేవు' అని అన్నారు. అయితే.. అది కాస్తా ఇప్పుడు బూమరాంగ్ అయ్యి, ఇస్లామాబాద్ ను ముప్పు తిప్పలు పెడుతుంది.అవును... వెనకా ముందూ చూసుకోకుండా తన గురించి తాను ఎక్కువ ఊహించుకుంటూ భారీ భారీ స్టేట్ మెంట్లు ఇవ్వడం పాక్ ప్రభుత్వ పెద్దలకు అలవాటే! ఈ క్రమంలో స్వల్ప సరిహద్దు ఘర్షణ, ఆఫ్ఘాన్ జాతీయులను సామూహికంగా బహిష్కరించిన అనంతరం రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు పూర్తిగా దిగజారిపోయి.. ఇరు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం చెలరేగింది!ఈ క్రమంలో దాని ప్రభావాలు పాకిస్థాన్ పై అసమానంగా పడుతున్నాయని తెలుస్తోంది. ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దు వాణిజ్యాన్ని నిలిపివేయడం వల్ల పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ భారీగా ప్రభావితమైందని.. ఇది అన్ని రంగాలకూ బిగ్ షాక్ ఇస్తుందని చెబుతున్నారు.వాస్తవానికి అక్టోబర్ 11న సరిహద్దు వాణిజ్య కేంద్రాలు మూసివేయబడినప్పటి నుంచీ ఇరాన్, భారత్, మధ్య ఆసియా రిపబ్లిక్స్ ద్వారా వాణిజ్యాన్ని దారి మళ్లించడాన్ని ఆఫ్ఘానిస్థాన్ త్వరగానే అలవాటు చేసుకుంది. అయితే.. పాకిస్థాన్ మాత్రం తీవ్రంగా దెబ్బతిందని తెలుస్తోంది. ఇలా సరిహద్దు వాణిజ్యాన్ని నిలిపివేయడం.. ఇప్పటికే ఇబ్బందుల్లో ఉన్నా పాక్ ఆర్థిక వ్యవస్థకు భారీ దెబ్బగా పరిణమిస్తోందని అంటున్నారు.ఈ నేపథ్యంలో... ఇటీవల పాకిస్థాన్ వ్యాపారవేత్తల బృందం జామియత్ ఉలేమా ఇ ఇస్లాం చీఫ్ మౌలానా ఫజ్లుర్ రెహ్మాన్ వద్దకు వెళ్లి కలిసింది. ఈ సందర్భంగా ఈ వ్యవహారంలో జోక్యం



చేసుకుని ఆఫ్ఘాన్ తో వాణిజ్యాన్ని పునరుద్ధరించడానికి సహాయం చేయమని వేడుకుందని.. ఈ సందర్భంగా... డ్యూరాండ్ లైన్ క్రాసింగ్ లను 45 రోజుల పాటు మూసివేయడం వల్ల తాము ఇప్పటికే ట్రిలియన్ల రూపాయలు కోల్పోయినట్లు చెప్పారని స్థానిక మీడియా నివేదించింది.ఈ ప్రతిష్టంభన గుమతులు, దిగుమతులు రెండింటికీ ఆఫ్ఘనిస్థాన్ పై ఆధారపడిన ప్రధాన పాకిస్థానీ పరిశ్రమలలో కొరత, ధరల పెరుగుదల, ఉత్పత్తి అంతరాయాలకు దారి తీసింది. దీనిపై పౌర సమాజం సైతం సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా స్పందిస్తుంది. ఈ సందర్భంగా కొంతమంది ఆఫ్ఘనిస్థానీలు.. కొనుగోలు దారులు లేక అమ్ముడుపోకుండా పడి ఉన్న ఉత్పత్తులను, పాకిస్థాన్ మండీల వీడియోలను పంచుకుంటున్నారు.మరోవైపు ఈ మూసివేత తర్వాత పాకిస్థాన్ లోని సిమెంట్ పరిశ్రమ అత్యంత తీవ్రంగా దెబ్బతిన్న వాటిలో ఒకటని.. ఆఫ్ఘాన్ బొగ్గు దిగుమతులు, సిమెంట్ ఎగుమతులు పూర్తిగా నిలిచిపోవడంతో.. పాక్ తయారీదారులు మొజాంబిక్, సౌతాఫ్రికా, ఇండోనేషియాల నుంచి చాలా ఖరీదైన బొగ్గుకు మారాల్సి వచ్చిందని పాక్ మీడియా నివేదించింది. అయితే ఈ పతనం బొగ్గు, సిమెంట్ తోనే ఆగలేదని.. ఈ ప్రభావం పాకిస్థాన్ అంతటా అనేక రంగాలకు వ్యాపించిందని చెబుతున్నారు.

# అక్స్‌ఫర్డ్ చర్చలకు రాకుండా అబద్దాల ప్రచారం

న్యూఢిల్లీ, తప్పుడు ప్రచారాలు చేయడం ద్వారా తప్పుకోవడం అలవాటు చేసుకున్న పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని చాటుకుంది. యూకేలో జరిగే ప్రముఖ చర్చలో పాల్గొనకుండా.. భారత్ అధికారులు వెనుదిరిగారంటూ తప్పుడు ప్రచారానికి తెర లేపింది. అయితే, దీన్ని భారత్ గట్టిగా తిప్పికొట్టింది. వివరాల్లోకి వెళితే.. యూకేలో ఆక్స్‌ఫర్డ్ యూనియన్‌లో గురువారం భారత్- పాక్ అధికారుల మధ్య చర్చజరగాల్సి ఉంది. ఇందులో భారత్ తరపున మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎం.ఎం.నరవాణెళి, సుబ్రమణియన్ స్వామి, రాజస్థాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్‌లు పాల్గొనాల్సి ఉంది. పాక్ నుంచి ఆ దేశ మాజీ విదేశాంగ మంత్రి హీనా రబ్బానీ, యూకేలోని రాయబారి మొహమ్మద్్గ÷సైల్, రిటైర్డ్ జనరల్ జుబైరా మహమూద్ హయత్‌లు హాజరుకానున్నారు. అయితే, ఈ చర్చలో పాల్గొనకుండా భారత్ అధికారులు చివరి నిమిషంలో వెనుదిరిగారంటూ యూకేలోని పాక్ రాయబార కార్యాలయం తప్పుడు ప్రచారానికి తెరలేపింది. 'పాక్ బృందం ఇప్పటికే లండన్‌లో సిద్ధంగా ఉంది. ఆక్స్‌ఫర్డ్ చర్చల్లో పాల్గొనాల్సి ఉంది. అయితే, ఇందులో పాల్గొనకుండా భారత్ బృందం వైదొలగాలని నిర్ణయించుకుందని యూనియన్ నిర్వాహకులు తెలిపారు. అందుకు గల కారణాలు మాత్రం తెలపలేదని ఎక్స్‌లో రాసుకొచ్చింది. అయితే పాక్ అబద్ధపు ప్రచారాన్ని భారత్‌కు చెందిన సీనియర్ న్యాయవాది సాయి దీపక్ గట్టిగా తిప్పికొట్టారు. పాక్ తన తప్పుడు ప్రచారాలను ఇంకా కొనసాగిస్తూనే ఉందని ఎద్దేవా చేశారు. సుబ్రమణియన్, నరవాణెళి కొన్ని కారణాల వల్ల చర్చకు హాజరుకాలేకపోతున్నందున, వీరికి ప్రత్యామ్నాయాలు చూపాలని యూనియన్ అధికారులు తనను కోరారని దీపక్ చెప్పారు. ఈ క్రమంలో తాను యూకేకు వెళ్లి మరో బృందంతో చర్చకు సిద్ధమయినట్లు తెలిపారు. అయితే.. చర్చకు కొన్ని గంటల ముందు యూనియన్ అధికారులు తనకు కాల్ చేసి.. పాక్ తరపున హాజరవ్వాల్సిన బృందం యూకేకు రాలేదని వెల్లడించారన్నారు. దీంతో చర్చ ఆగిపోవడం తనకు ఆగ్రహం తెప్పించిందన్నారు. పాక్ బృందం కూడా యూకేలోనే ఉందని, భారత్‌తో చర్చల్లో పాల్గొనేందుకు భయపడి వెనుదిరిగినట్లుగా కనిపిస్తుందని విమర్శించారు.

# సిరిసిల్లలో కేటీఆర్‌కు కాంగ్రెస్ చెక్ పెడుతుందా?



గ్రామపంచాయతీ ఎన్నికల హడావిడి మొదలైంది. రాజకీయ పార్టీల గుర్తులు లేనప్పటికీ వారి మద్దతుదారులే రంగంలోకి దిగుతున్నారు. ముఖ్యంగా రాజకీయ పార్టీల ప్రధాన నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న సెగ్మెంట్లపైనే అందరి దృష్టి ఉంటుంది. అందులో భాగంగానే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలో ఎలాంటి ఫలితాలు వస్తాయని ఆసక్తి నెలకొంది. గత గ్రామపంచాయతీ ఎన్నికల్లో 90 శాతానికి పైగా బీఆర్ఎస్ మద్దతుదారులే విజయం సాధించారు. ఇప్పుడు కాంగ్రెస్ ను ఎదుర్కొని అలాంటి ఫలితాలు వస్తాయాబీ.. కేటీఆర్ వ్యూహం ఏంటి?

**బీఆర్ఎస్‌కు కంచుకోటగా మారిన సిరిసిల్ల నియోజకవర్గం**

సిరిసిల్ల నియోజకవర్గం బీఆర్ఎస్‌కు కంచుకోట. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి 2023 వరకు ప్రతి ఎన్నికల్లో కూడా తన సత్తాను చాటింది. ఇక్కడ ముఖ్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్యే కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత గ్రామపంచాయతీ ఎన్నికల్లో టిఆర్ఎస్ మద్దతుదారులే 90 శాతానికి పైగా విజయం సాధించారు. అదేవిధంగా మిగతా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ తన హవాను చాటింది. ఇప్పుడు జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో అలాంటి ఫలితాలు వస్తాయా.. అనే చర్చ సాగుతోంది.

**ఈ సారి బీఆర్ఎస్ ప్రభావం చూపుతుందా?**

రెండు సార్లు అధికారం చెలాయించి, ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ స్థానిక సంస్థల్లో ఎంత ప్రభావం చూపుతుందన్న చర్చ మొదలైంది. ఇక్కడ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న క్రమంలో గత ఎన్నికల ఫలితాలు వస్తాయా.. రావా.. అనే అంశం పైన చర్చ కొనసాగుతోంది. ముఖ్యంగా అధికార పార్టీ కాంగ్రెస్ కేటీఆర్ ను దెబ్బతీసేందుకు తమ మద్దతుదారులను అధికంగా గెలిపించేందుకు వ్యూహాలను రూపొందిస్తుంది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నేత కేకే మహేందర్రెడ్డి ఈ క్రమంలో ఈ సెగ్మెంట్ పైన ప్రత్యేక దృష్టి పెట్టారు. సిరిసిల్ల సెగ్మెంట్లో అత్యధికంగా గ్రామీణ ప్రాంతం ఉంటుంది. ఇక్కడ ఏ పార్టీ మద్దతుదారులు విజయం సాధిస్తే జరగబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై ప్రభావం చూపుతుంది

**సిరిసిల్లలో ముఖ్య నేతలతో కేటీఆర్ సమావేశం**

ఇప్పటికే కేటీఆర్ రెండుసార్లు సిరిసిల్లలో ముఖ్య నేతలతో సమావేశం అయ్యారు. అంతేకాకుండా మండలాల వారీగా నేతలను పిలిపించుకొని వారితో మాట్లాడారు. గత ఎన్నికల ఫలితాలే మళ్లీ ప్రతిబింబించాలని నేతలను, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఇప్పటికే మొదటి దశ పంచాయతీ ఎన్నికలు ముగిసాయి. రెండు, మూడు విడతలలో సిరిసిల్ల సెగ్మెంట్లలో పలు గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. గ్రామాలలో బలమైన బీఆర్ఎస్ నేతలను సర్పంచ్లుగా బరిలోకి దింపుతున్నారు. అదేవిధంగా మేజర్ గ్రామపంచాయతీలో మరింత సత్తా చాటేందుకు ప్లాన్ రూపొందిస్తున్నారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతూ వచ్చిన గులాబీ పార్టీ**

ముఖ్యంగా మండల కేంద్రాల్లో పై చేయి సాధించేందుకు ముందుండాలని బిఆర్ఎస్ నేతలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. కేటీఆర్ వీలున్న సమయంలో పార్టీ శ్రేణలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. గెలాబీ పార్టీ అధికారం పోయిన తర్వాత ఇవి మొట్టమొదటి స్థానిక సంస్థల ఎన్నికలు. గత ఎన్నికలు లాగా బీఆర్ఎస్ విజయం సాధిస్తుందా.. అధికార పార్టీ పైచేయి సాధిస్తుందా? అన్నిది పార్టీలోనే చర్చకు దారి తీస్తోంది. గులాబీ శ్రేణులు ఈ ఎన్నికలు కేటీఆర్ కు అత్యంత కీలకం ఈ క్రమంలోనే ఏ చిన్నపాటి పొరపాటు చేయవద్దంటూ నేతలను కోరుతున్నారు. ఇక్కడ అధికార పార్టీ కాంగ్రెస్ తో పాటు, ప్రతిపక్ష పార్టీ బిజెపి కూడా గట్టి దృష్టి పెట్టింది. ఈ రెండు పార్టీలను ఎదుర్కొని బీఆర్ఎస్ మద్దతు దారులు ఎంతవరకు సత్తా చాటుతాటంరటూ చర్చ సాగుతుంది.

**గ్రామాల వారిగా బీఆర్ఎస్ నేతల వివారాలు**

ఇప్పటికే గ్రామాల వారిగా బీఆర్ఎస్ నేతలు వివరాలను సేకరించారు. రిజర్వేషన్ల వారీగా మద్దతు దారులను ఖరారు చేయనున్నారు. ముఖ్యంగా మేజర్ గ్రామపంచాయతీలో మాత్రం పార్టీ ప్రభావం స్పష్టంగా కనబడుతుంది. దీంతో మేజర్ గ్రామపంచాయతీలో గతంలో లాగానే సత్తా చాటాలని దృష్టి పెడుతున్నారు. అయితే కేటీఆర్ ఎంత చేసిన ఏం చేసిన తమదే విజయం అంటూ కాంగ్రెస్ ధీమాగా ఉంది. తను ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల్లోకి వెళ్తున్నామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అయితే 6గ్యారంటీల అమలు లేని విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ గట్టిగానే ప్రచారం చేస్తోంది. మొత్తానికి కేటీఆర్ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మరి చూడాలి ఏ పార్టీ మద్దతుదారులు గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయం సాధిస్తారో.

# గరంగరం.. వరంగల్ బల్దియా సమావేశం..

వరంగల్ :గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం గరం గరంగా సాగింది. ప్రజా ప్రతినిధుల ఆగ్రహంతో సమావేశం వాడి వేడిగా ముగిసింది. ప్రజా సమస్యలను పట్టించుకోవడంలో మేయర్, కమిషనర్, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులే ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకు అంటూ నిలదీశారు. బందోబస్తు పేరుతో పోలీసులు కార్పొరేటర్లను తనిఖీ చేయడమేంటంటూ ప్రశ్నించారు. తదుపరిరూ.135 కోట్ల అభివృద్ధి పనులకు వరంగల్ బల్దియా కౌన్సిల్ ఆమోదం తెలియజేసింది. ఈ సందర్భంగా కౌన్సిల్లో ప్రవేశపెట్టిన 39 ఎజెండా అంశాల పై చర్చించి ఆమోదం తెలిపారు. ఈ మేరకు సోమవారం బల్దియా మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిషనర్ చాహత్ బాజ్పాయ్, వివిధ పార్టీల కార్పొరేటర్లు, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య , ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**కమిషనర్, మేయర్ పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ**

మేయర్ తో పాటు, కమీషనర్, కార్పొరేషన్ అధికారులపై మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై ఏ ఒక్క అధికారి స్పందించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా పాలనలో ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ ఉందన్నారు. కౌన్సిల్ కు వచ్చే నేతలను బందిపోటు దొంగల్లా పోలీసులు తనిఖీలు చేస్తున్నారని మండిపడ్డారు. బందోబస్త్ తనిఖీల పేరుతో పోలీసుల అత్యుత్సాహం మంచిది కాదన్నారు. అభివృద్ధిపై స్పందించని కౌన్సిల్ సమావేశం ఎందుకంటూ నిలదీశారు.

**పదేళ్లు నిలిచిపోయిన అభివృద్ధి - ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

గత పదేళ్లులో గ్రేటర్ పరిధిలో అభివృద్ధి కుంటుపడిందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. రెండేళ్లలో అనుకున్న దానికి మించి అభివృద్ధి చేశామన్నారు. గత ప్రభుత్వంలో నాయకులు కేంద్రం ఇచ్చిన స్మార్ట్ సిటీ నిధులను



కుడా సరిగ్గా వినియోగించుకోలేదన్నారు. నిర్దిష్ట ప్రణాళిక లేకుండా కమీషన్ల కోసం గత ప్రభుత్వంలో నాయకులు పని చేశారని విమర్శించారు.

**39 అభివృద్ధి అంశాలకు ఆమోదం**

ఇటీవల వచ్చిన వరద వల్ల దెబ్బతిన్న ప్రతి డివిజన్ కు అత్యవసర పనుల నిమిత్తం రూ.5 లక్షల కేటాయించారు. ప్రతి డివిజన్ కు 5 హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అమృత్ 2.0 లో భాగం గా వచ్చే 20 సం.లకు సరిపడే అవసరాలకు అనుగుణం.గా త్రాగు నీటి సరఫరా పనులు చేపట్టాలని తీర్మానం చేశారు. నగర అభివృద్ధి పథకం కింద రూ. 50 కోట్లతో బహుళార్ధకంగా ఉపయోగపడే పనులు చేయాలని, 66 డివిజన్ లలో 198 మంది వాలంటీర్ల ద్వారా తడి పొడి చెత్త పై అవగాహన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల వచ్చిన వరదల్లో విస్తృత సేవలు అందించిన పారిశుద్ధ్య సిబ్బంది, డ్రైవర్లకు ప్రోత్సాహకంగా వెయ్యి రూపాయల అందజేయాలని, ఘన వ్యర్థాల నిర్వహణకు బయో మిథనైజేషన్ ప్లాంట్ 100 టి పి డి (టన్స్ ఫర్ డే) సామర్థ్యంతో ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించారు.

# అంగట్లోకి ఇంటిగుట్టు...




హైదరాబాద్,దక్షిణకొరియాలో భారీ సైబర్ గుట్టును పోలీసులు రట్టు చేశారు. 1,20,000 సీసీ కెమెరాలు హ్యాక్ చేసి వాటి ద్వారా రహస్య సమాచారం సేకరిస్తున్న నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీసీ కెమెరాల ద్వారా ప్రజలు వ్యక్తిగత వీడియోలను నిందితులు సేకరించేవారని వాటిని అమ్మి పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించేవారని తెలిపారు.దక్షిణ కొరియాలో భారీ స్కామ్ బయటపడింది. నివాస ప్రాంతాలతో పాటు పలు వ్యక్తిగత ప్రదేశాలలో భద్రత కోసం ఏర్పరుచుకున్న సీసీ కెమెరాలను సైబర్ ముఠా హ్యాక్ చేశారు. అనంతరం ఆ కెమెరాల ద్వారా బాధితుల వ్యక్తిగత వీడియోలను సేకరించి ప్రైవేట్ వెబ్‌సైట్ లకు అమ్మేవారు. దీనికోసం నిందితులు, నివాస గృహాలు, ఆసుపత్రులు, లాడ్జ్ లు ఇతర ప్రాంతాలలో అమర్చిన సీసీ కెమెరాలనే టార్గెట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.కాగా ఈ ఘటనపై సౌత్ కొరియా పోలీసులు ప్రకటన విడుదల చేశారు. నిందితులని అదుపులోకి తీసుకున్నామని వారిలో ఒకరు 63 వేల కెమెరాలను హ్యాక్ చేశాడని పోలీసులు తెలిపారు. దాని ద్వారా 545 వ్యక్తిగత వీడియోలను సేకరించి వివిధ వెబ్‌సైట్ లకు అమ్మాడన్నారు. దాని ద్వారా 35 మిలియన్లు సంపాదించారని తెలిపారు. మరోక వ్యక్తి 70 వేల కెమెరాలను హ్యాక్ చేసి 648 ప్రైవేట్ వీడియోలను అమ్మినట్లు తెలిపారు. ఇలా చేయడం ద్వారా నిందితులిద్దరూ పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించినట్లు పోలీసులు పేర్కొన్నారు. అయితే అరెస్టైన నలుగురికి ఎటువంటి పరిచయం లేదన్నారు.ప్రజల వ్యక్తిగత విషయాలకు సంబంధించిన వీడియోలు అప్ లోడ్ చేసిన వెబ్‌సైట్ లపై నిఘా ఉంచామని త్వరలోనే దానిలోని కంటెంట్ తొలగిస్తామని పోలీసులు తెలిపారు. వాటిని గుర్తించడానికి ఫారెన్ ఏజెన్సీల సహాయం తీసుకుంటున్నామన్నారు. నిందితులు సీసీ కెమెరాలు హ్యాక్ చేసిన ప్రదేశాలలో వారి కెమెరాలు హ్యాక్ అయినట్లు సమాచారమిచ్చామని పోలీసులు పేర్కొన్నారు. బాధితులకు కెమెరా హ్యాక్ కాకుండా ఏలా జాగ్రత్త పడాలి, పాస్ వర్డ్ ఎలా మార్చుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు.

# చిన్నిచిన్న సమస్యలు పార్టీలో సహజమే

అమరావతి,పార్టీ నేతలు అలక వీడాలని, సమస్యలు ఏవైనా ఉంటే సంబంధిత వ్యక్తుల దృష్టికి తీసుకురావాలని టిడిపి ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ఆ పార్టీ నేతలతో అన్నారు. టిడిపి కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా 'కాఫీ కబుర్లు' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో లోకేష్ పాల్గని ప్రసంగించారు. టిడిపి యూనివర్సిటీ లాంటిందన్నారు. మై టిడిపి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, యాప్ ద్వారానే పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేస్తామన్నారు. పార్టీ కుటుంబం వంటిదని, చిన్న, చిన్న సమస్యలు సహజమన్నారు.క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జ్లు, కుటుంబ సాధికార సారథులతో కలిసి కూర్చొని సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని చెప్పారు. ప్రజల మనస్సులు గెలుచుకునే విధంగా పనిచేసి స్థానిక ప్రజలతో అనుబంధం ఏర్పరచుకోవాలని దిశానిర్దేశం చేశారు.గ్రామ, మండల పార్టీ అధ్యక్షులు రాష్ట్రస్థాయి నేతలుగా, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఉపముఖ్యమంత్రులుగా పనిచేయాలనేది పార్టీ సిద్ధాంతం, విధానమని చెప్పారు. వైసిపి ఐదేళ్ల రాక్షస పాలన ఎలా ఉందో చూశామని తెలిపారు. ప్రజల మనస్సులు గెలుచుకునే విధంగా పనిచేయాలని, స్థానిక ప్రజలతో అనుబంధం ఏర్పరచుకోవాలని చెప్పారు.కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. పనిచేసే వారిని ప్రోత్సాహిస్తా మన్నారు. అందరం ఒకే లక్ష్యంతో కలిసికట్టుగా పనిచేస్తేనే విజయాలు సాధిస్తామన్నారు. కష్టం లేనిదే ఫలితం లేదని, అందరూ



కష్టపడాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, మాజీమంత్రులు ఎన్ అమర్‌నాథ్ రెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్, ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, గౌతు శిరీష పార్టీ చరిత్ర, సిద్ధాంతాలు, సంస్థాగత నిర్మాణం, విధులు, బాధ్యతలపై మార్గదర్శనం చేశారు. అనంతరం మండల పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల అభిప్రాయాలను లోకేష్‌కు నివేదించారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించి పార్టీ కార్యకర్తలు, ప్రజల నుంచి వినతులు స్వీకరించినన పరిశీలించి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

# గ్లోబల్ బ్రాండ్‌గా తెలుగు సినిమాలు

అమరావతి,'దేశంలోనే సినిమా షూటింగ్‌లకు అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలుపుతాం. ఏపీలో సమగ్రమైన కొత్త 'ఫిల్మ్ టూరిజం పాలసీ'ని ఆవిష్కరిస్తాం. భారత దేశ మీడియా, ఎంటర్‌టైన్మెంట్ రంగంలో పెట్టుబడులు పెడితే అవసరమైన ప్రోత్సాహం, భరోసా కల్పిస్తాం.కలిసి పనిచేసి తెలుగు చలన చిత్ర పరిశ్రమలో నూతన అధ్యాయం సృష్టిద్దాం. ఇంటిగ్రేటెడ్ ఫిల్మ్ సిటీలు, ఆధునిక ఫిల్మ్ స్టూడియోలు, డబ్బింగ్ థియేటర్లు, రీ-రికార్డింగ్ సౌకర్యాలను నిర్మించే వెంచర్లకు ఏపీ ప్రభుత్వం తరపున సంపూర్ణమైన మద్దతు ఇస్తాం. ప్రతిభకు పెద్దపీట వేస్తూ త్వరలోనే నంది అవార్డులు, నంది నాటకోత్సవాలను నిర్వహిస్తాం. హిందీ తర్వాత భారతదేశంలో తెలుగు సినీ పరిశ్రమ రెండో అతిపెద్దదిగా నిలిచింది. ఇది జాతీయ చలనచిత్ర పరిశ్రమకు దాదాపు 20 శాతం వాటాను అందిస్తోంది. 'బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్, కల్కి 2898 ఏడీ, పుష్ప సిరీస్‌లు, సలార్, ఓజీ' వంటి ప్రపంచ స్థాయి సినిమాలు కథాకథనం, విజువల్ ఎఫెక్ట్స్, నిర్మాణ నాణ్యతలో అద్భుతంగా ఉండి బాక్సాఫీస్ కలెక్షన్లలో కొత్త బెంచ్‌మార్క్‌లను సెట్ చేసి తెలుగు సృజనాత్మకతకు నిదర్శనంగా నిలిచాయి. తెలుగు సినిమాను గ్లోబల్ బ్రాండ్‌గా మార్చాయి. తమిళనాడు తర్వాత




అత్యధికంగా ఏపీలో 1,103 స్క్రీన్లు ఉన్నాయి. ఈ రంగానికి మా ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుంది' అని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ముంబైలో సోమ, మంగళవారాల్లో జరుగుతున్న 'సిఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్-2025'లో ఇన్వెస్టర్లతో ఆయన మాట్లాడారు. ఫిల్మ్, టూరిజం రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు.

# ఐబొమ్మ రవికి మించిన ముదుర్లు అతడి ఫ్రెండ్స్?






హైదరాబాద్,సంచలనంగా మారిన ఐబొమ్మ రవి ఉదంతానికి సంబంధించి పోలీసులు రెండు దఫాలుగా నిర్వహించిన విచారణలోని కొన్ని అంశాలు తాజాగా వెలుగు చూశాయి. పోలీసులకు ముప్పతిప్పలు పెట్టి.. చివరకు దొరికిపోయిన ఐబొమ్మ రవి సంగతి తెలిసిందే. తాను ఎట్టి పరిస్థితుల్లో పోలీసులకు చిక్కనన్న ధీమాతో అతడి అత్యుత్సాహం అతడ్ని పట్టించిందని చెబుతున్నారు. ఐబొమ్మ రవికి తగ్గట్లే.. అతడికి అన్ని విధాలుగా సాయం చేస్తూ.. అండగా నిలిచిన అతని ఇద్దరు ఫ్రెండ్స్ మహా ముదుర్లుగా చెబుతున్నారు.ఐబొమ్మ రవిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అనంతరం అతడికి అత్యంత సన్నిహితులైన ప్రసాద్.. ప్రహ్లాద్ కుమార్ లను గుర్తించే పనిలో పోలీసులు పడ్డారు. అయినప్పటికి వారి ఆచూకీ ఇప్పటివరకు లభించని పరిస్థితి. పోలీసులు ఎంతలా ట్రాక్ చేసినా.. వారి ఆచూకీ మాత్రం ఇంకా లభించలేదని చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. పోలీసుల విచారణలో వెల్లడించిన కొన్ని అంవాలకు సంబంధించి ఐబొమ్మ రవి ఇచ్చిన స్పష్టతకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగు చూస్తున్నాయి.అమీర్ పేటలో కంప్యూటర్ కోర్సులు చేసే రోజుల్లోనే రవి తన ఐడెంటిటీని రహస్యంగా ఉంచేవాడని చెబుతున్నారు. ఐదారు నెలలకు ఒకసారి హాస్టల్ మారేవాడని గుర్తించారు. 2020లో ప్రహ్లాద్ కుమార్.. ప్రసాద్ ను స్నేహితులుగా పేర్కొంటూ సప్లయిస్ ఇండియా.. హాస్పిటల్స్ డాట్ ఇన్ పేరుతో రెండు కంపెనీలు షురూ చేశారు. వీరి వివరాలతోనే ఆధార్.. పాన్ కార్డులు.. డిజైన్ సంతకాలు రూపొందించారు. దాదాపు 35కు పైనే డొమైన్లు నిర్వహిస్తున్నారు.ఐబొమ్మ.. బప్పం టీవీ వెబ్ సైట్లను ప్రారంభించిన తర్వాత తాను ఎవరన్న విషయం బయటకు రాకుండా ఉండేందుకు పలు జాగ్రత్తలు తీసుకున్న విషయాన్ని పోలీసులు గుర్తించారు. ఫ్రెండ్స్ ఐడెంటిటీతో డొమైన్లు కొనుగోలు చేసి.. అందుకు తగ్గట్లే బ్యాంక్ లావాదేవీల్ని నిర్వహించారు. తాను సంపాదించిన డబ్బుపై ప్రతి నెలా రూ.2 లక్షల వరకు రవికి ఆదాయం వచ్చేదని.. ఆ డబ్బులతో తరచూ విదేశాలకు వెళ్లి వచ్చేవాడన్న విషయాన్ని పోలీసులు గుర్తించారు. రవికి అండగా నిలిచిన ఇద్దరు స్నేహితుల్ని అదుపులోకి తీసుకునేందుకు ఎంతలా పరయత్నిస్తున్నా.. వారి ఆచూకీ మాత్రం దొరకపోవటం చూస్తే.. ఐబొమ్మ రవికి మించిన ముదురుకేసులుగా పోలీసులు భావిస్తున్నారు.

## స్కూటీపై వెళుతున్న యువతిపై యాసిడ్ దాడి

హన్మకొండ,హన్మకొండ జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. మరో యాసిడ్ దాడి ఘటన కలకలం రేపింది. ఒంటరిగా వెళుతున్నయువతిపై యాసిడ్ దాడి జరిగింది. కాజీపేట మండలం కడిపికొండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఓ యువతిపై యాసిడ్ దాడి జరిగింది. స్కూటీపై వెళ్తున్న యువతిని బండి ఆపి ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు యువకుల్లో ఒకడు యాసిడ్‌తో దాడి చేసి పరారయ్యాడు. దీంతో యువతి అరుపులకు స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరుకొని 108కి సమాచారం అందించారు. అనంతరం బాధితురాలిని చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మడికొండ పోలీసులు ఆరా తీశారు. ఎంజీఎంలో ఉన్న బాధితురాలి వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. యువతి అయినవోలు మండలం వెంకటాపురంలోని తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నట్లు సమాచారం.

# తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రతకు పెద్దపీట




హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రతకు, ముఖ్యంగా శ్రామిక మహిళల సురక్షిత ప్రయాణానికి ఉద్దేశించిన 'టీ-సేఫ్' వ్యవస్థ దేశంలోనే ఒక విప్లవాత్మక ముందడుగు అని తెలంగాణా రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి పేర్కొన్నారు. చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ఇటీవల జరిగిన డీజీపీల కాన్ఫరెన్స్‌లో 'టీ-సేఫ్ మహిళల కోసం సురక్షిత ప్రయాణం' అనే అంశంపై ప్రజెంటేషన్ ఇచ్చి, ఈ సాంకేతిక పరిజ్ఞానం యొక్క విశిష్టతను వివరించారు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 2022 ప్రకారం, భారతదేశంలో అత్యధికంగా శ్రామిక మహిళల శాతం తెలంగాణలోనే ఉన్న నేపథ్యంలో, రాష్ట్రంలో మహిళల ప్రయాణాన్ని అత్యంత సురక్షితం చేయాలనే లక్ష్యంతో 2024లో 'టీ-సేఫ్' యాప్‌ను ప్రారంభించినట్లు డిజిపి వెల్లడించారు. ఇప్పటివరకు మహిళా భద్రత కోసం ఉన్న సౌకర్యాలు కేవలం అత్యవసర ప్రతిస్పందన కోసం మాత్రమే పనిచేస్తుండగా, 'టీ-సేఫ్' మాత్రం ప్రయాణం మొదలైనప్పటి నుంచే పర్యవేక్షణ ప్రారంభిస్తుంది. ఈ విధంగా, ఇది కేవలం 'ప్రతిస్పందించే విధానానికి బదులుగా, 'ముందస్తు నివారణ' విధానంలో పనిచేయడం దీని ప్రధాన ప్రత్యేకత అని ఆయన పేర్కొన్నారు. 'ట్రావెల్-సేఫ్' లేదా 'టీ-సేఫ్' యొక్క ముఖ్య లక్షణాలలో ఒకటి దీనికి స్మార్ట్ ఫోన్ అవసరం లేకపోవడం. ఇందులో ఆటోమేటెడ్ రైడ్ ట్రాకింగ్ ఫీచర్ అందుబాటులో ఉంది. ఇది రూట్ డివియేషన్స్ చేరుకోవాల్సిన అంచనా సమయం ఆలస్యం, వెరిఫికేషన్ కాల్‌కు సమాధానం ఇవ్వకపోవడం, ప్రయాణం ఎక్కువ సమయం తీసుకోవడం, తప్పు పాస్‌కోడ్‌ను నొక్కడం వంటి 42 రకాల డివియేషన్స్ గుర్తించగలదు. ఈ ఫీచర్ మొదలైనప్పుడు సమీపంలోని వ్యాన్లు లేదా పోలీస్ పెట్రోల్ మోటార్‌సైకిళ్లు తక్షణమే బాధితురాలి ప్రదేశానికి చేరుకుంటాయని ఆయన తెలిపారు. ఈ సదుపాయానికి మహిళల నుంచి 5 కు గాను 4.7 రేటింగ్ లభించిందని ,ఈ విషయంలో ఇప్పటికే 350కి పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని డిజిపి తెలియజేశారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని ఉబర్, ఓలా, రాపిడో , మేరు, అభిబస్, వంటి అన్ని క్యాబ్ అగ్రిగేటర్‌లతో టీ-సేఫ్‌ను సమగ్రపరచాలని ప్రతిపాదించారు. అంతేకాకుండా, కృత్రిమ మేధ ఉపయోగించి మహిళా భద్రతకు బలహీన ప్రాంతాలను గుర్తించిన తర్వాత ఆటోమేటెడ్ సేఫ్టీ చెక్ కాల్స్‌ను ప్రారంభించాలని యోచిస్తున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com